08

Regd. No. M. 760.

Vol. I. } DECEMBER. { No. 4.

# AKASAVANI.

## A MONTHLY MAGAZINE.

**Editors**

**A. BAPIRAZU**

**AND**

**S. SATYANARAYANA MURTY.**

" జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి."

విషయసూచిక.

1. శాసననిర్మాణసభాసభ్యులు, వారి ధర్మములు.
2. విజయవిలాసకృతివిమర్శనము.
3. భక్తచింతామణి.
4. చంద్రసేనవిజయము. (చక్కని కథ)
5. రాజపుత్రవిజయము. (నాటకము)
6. ద్రౌపది. (పతివ్రతచరిత్ర)
7. న్యాయవాదివిలాసము. (ప్రహసనము)
8. డిశెంబరు పంచాంగం.

inted & Published by A. BAPIRAZU, V. N. Press, Rajahmundry

| | |
|---|---|
| చందా సంవత్సరమునకు | రు 2—8—0. |
| సహాయులకు | 5—0—0 |
| పోషకులకు | 10—0—0. |

రాజపోషకులకు వారి యనుగ్రహాధీనము.

ప్రకటనలకు రేట్లు తెలియగోరువారును దీనికి చందాదారులుగ నుండగోరువారును మాకు వ్రాయవలయును.

పత్రికాధిపతులు

ఆకాశవాణి, రాజమండ్రి.

# ఆకాశవాణి

పత్రికాధిపతులు

అయ్యగారి బాపిరాజు

సూరంపూడి సత్యనారాయణమూర్తి

**Vol. 1.** } రాజమహేంద్రవరము. డిశంబరు. 1912. { **No. 4.**


## శాసననిర్మాణ సభాసభ్యులు, వారి ధర్మములు.

శాసననిర్మాణ సభలనగనేవియో, వానికిని ప్రజలకునుగల సంబంధ మెట్టిదియో, మాపత్రిక మొదటి సంపుటము రెండవసంచికయందు సంగ్రహముగఁ దెలిపి యున్నారము. శాసననిర్మాణ సభాసభ్యులు; వారి ధర్మములను ఆసభల యుపయోగములను గూర్చి యీపత్రికయందించుక ముచ్చటించెదము.

సభ్యులనగనెవరు?—ఈసభయందలి సభ్యులు రెండువిధములుగ నుందురు. దొరతనమువారిచే నియమింపఁబడువారొకరు. ప్రజలచేనెన్నుకొనఁబడువారొకరు. దొరతనమువారిచే నియమింపఁబడువారిలో కొందఱు దొరతనమువారి యుద్యోగమునందున్నవారు. కొందఱు ఉద్యోగములో లేనివారు. ప్రజలచే నెన్నుకొనఁబడువారందఱునుద్యోగులుకానివారే. వీరినే ప్రజాప్రతినిధిసభ్యులందురు. వీరినిగూర్చియే మేమీపత్రికయందు ప్రశంసించెదము. ప్రతినిధియనగా ఒకనితరఫున నాతఁడు చేయవలసినకార్యమును

నెరవేర్చుటకై నియమింపఁబడు వేఱొకమనుష్యుఁడు. శాసననిర్మాణసభల యందు ప్రజలుచేయవలసిన పనులను నెరవేర్చుటకై ప్రజలచే నియమింపఁబడినవారు; కావున వీరికీపేరువచ్చినది. ప్రతినిధులను ఆంగ్లేయభాష యందు రిప్రిజంటేటివులందురు. ఈసభ్యులకు ఇంగ్లీషుభాషలో లెజిస్లేటివ్ కౌన్సిలు మెంబర్లనిపేరు. ప్రజలచే నెన్నుకొనఁబడువారిలో కొందరు తాలూకాబోర్డులు డిస్ట్రిక్టుబోర్డులు మునిసిపాలిటీలవలనను, కొందరు భూస్వాములవలనను, కొందఱు జమీందార్లువలనను,కొందరు వర్తకసంఘమువారిచేతను, మరికొందఱు మఱికొందఱిచేతను ఎన్నుకొనఁబడుచుందురు. ఎన్నుకొనుటకును ఎన్నుకొనఁబడుటకును కొన్నినిబంధనలున్నవి. వార్తాపత్రికలవలన చదువరులు గ్రహించియే యుందురని మాయభిప్రాయము.

సభ్యులెట్టివారుగ నుండవలయును?—దొరతనమువారేర్పరచిన నిబంధనల ననుసరించి, విశేషభూవసతిగలవారుగా గాని, విశేషధనవంతులుగా గాని, విద్యాధికులుగా గాని యుండవలయును. ఆయావిధులననుసరించి యెవరెవరు ఈసభ్యత్వమున కర్హులో గెజటులు మొదలగువానియందు బ్రకటించుచునే యుందురు. సభ్యులుగా నుండగోరువారును, సభ్యులనెన్నుకొనువారును అట్టి యర్హతలను స్థూలభావముగాఁ దెలిసికొనఁగలుగుదురు. కావున నావిషయమై మేమిటనుడువఁబనిలేదు. కాని ఆవిధులకుతోడు, సభ్యులకు కొన్నిసుగుణములుండవలయును. అవి యుండినగాని సభ్యత్వపదవిని నిర్వహింపఁజాలరు. అవి విమర్శించి చూచినఁగాని తెలియఁబడవు. అభ్యసించినగానిఁ పట్టుపడవు. అందుమొదటిది. స్వార్థత్యాగము, ఈసభ్యత్వపదవి నభిలషించు ప్రతిమానవునకును ఈమహాసుగుణముండి తీరవలయును. శాసననిర్మాణసభాసభ్యత్వపదవివలన వచ్చులాభమేమియు నుండదు, సరికదా వారిస్వకార్యధ్వంసము ధనవ్యయము శరీరాయాసము మొదలగునవెన్నియోసంభవించును. ఇన్నికష్టములకోర్చి లాభములేని యీపదవియందుఁ బ్రవేశించుట ప్రతిమనుష్యునకును కష్టముగనే దోఁచుఁ

చుండును. కాని, తనదేశాభివృద్ధిని, తనప్రజాభివృద్ధినిగోరు స్వార్థత్యాగికి కష్టములన్నియుతృణములుగను, లాభములు కొండలుగను గాన్పించు చుండును. అట్టి స్వార్థత్యాగియే యీపదవికర్హుఁడు. గవర్నరుగారిసభలో మెంబరగుటచే వ్యాజ్యము లెక్కువవచ్చునని తలంచువకీలుగాని, ఆనరేబిల్ అను గౌరవమువచ్చునని యెంచుడంబాభిలాషిగాని, వేలుగానీ లక్షలు గానీ ఖర్చుపెట్టియైనను యీగౌరవమును కొని తనసరివారిలో నధికుఁడు గనుండవలయునని యూహించు ధనవంతుఁడుగాని యీపదవికనర్హులు! అనర్హులు! తాను చెడినను ప్రజలకుపకారమును చేయవలయునను నుద్దేశమును గట్టిగనమ్మియుండినదానిని నాచరణలోనికి దెచ్చు పరోపకారి, స్వార్థత్యాగి, దేశాభిమాని, ఈశ్వరసమానుఁడు, ఈపదవికర్హుఁడు. ఏదో యొకవిధముగ తనకార్యములకుఁ దోడుపడునని యో తన్నందఱును గౌరవముగఁ జూతురనియో, గొప్పవారందరి తోడను స్నేహమును సంపాదింప వచ్చుననియో తలంచు స్వార్థపరుఁడు, డంబాచారి, ఈపదవికనర్హుఁడు.

రెండవది అనుభవజ్ఞానము. ఇదియొక మహద్విషయము. ప్రతి సభ్యుఁడును, దొరతనమువారి రాజనీతి యెట్లున్నదియో, ప్రజ లెట్టిస్థితి యందున్నారో, తానెవరిపక్షమున నియమింపఁబడెనో అట్టివారికిఁ గలుగుచున్న యిక్కట్టులెవ్వియో సభయందెట్టికార్యములు జరుపఁబడుచున్నవియో, వానికిని తనపక్షమువారికిని గలసంబంధమెట్టిదియో, అందు గావలసినమార్పులెవ్వియో, ప్రజాభిప్రాయ మెట్లున్నదియో, మొదలగు లెక్కలేనన్ని విషయములను దెలిసికొనవలసియుండును. దొరతనమువారి రాజనీతిని ప్రజలకును ప్రజాభిప్రాయమును దొరతనమువారికిని దెల్పి కార్యములను చక్కఁజేయు భారమీ సభికునిపైనుండును; ఇది సామాన్య కార్యము కాదు. ప్రజలు చాలమంది యవివేకులుగ నుందురు. ఏకార్యములనట్లనెట్లు ప్రవర్తింపవలయునో దేనివలన నెట్టిలాభము గలుగునో యోచించి చెప్పి వారల నడిపింపవలసినవాఁడే సభ్యుఁడు. ఎంతయో అను

భవజ్ఞానముండినఁగాని యీమహాకార్యమును నిర్వహింపఁజాలఁడు. భూములయొక్కయు, వర్తకముయొక్కయు, విద్యయొక్కయు, ఉద్యోగీయులయొక్కయు, రయితులయొక్కయు ప్రస్తుతపుస్థితిగతులు, వాటియభివృద్ధికి కావలసినమార్పులు, అవిచేయుటకుఁ గలయుపాయములు మొదలగు వానినిగూర్చి అనునిమిషమును తెలిసికొనుచుండవలయును. ఈజ్ఞానమును సంపాదింపవలెనన్న ఎన్నియో పూర్వపుచారిత్రములు ప్రస్తుతపుచారిత్రములు, శాసనములు, నిబంధనలు, ఆంగ్లేయవార్తాపత్రికలు, దేశీయవార్తాపత్రికలు చదువుచుండవలయును. కేవల గ్రంథపఠనమే కాకుండ తాను నియమింపఁబడిన ప్రదేశములయందు అధమము సంవత్సరమునకు రెండుసారులైనను తిరిగి అక్కడక్కడగల విద్యాధికులతో పెద్దరయితులతో వర్తకులతో మాటలాడి ఆయాస్థితిగతులను దెలిసికొనుచుండవలయును. ఇట్లు చేసినఁగాని లోకజ్ఞానము గలుగనేరదు. ఈయనుభవజ్ఞానము లేని సభ్యుఁడు సభలో హాస్యాస్పదుఁడగుచుండును. ప్రజలగౌరవమునకుఁ బాత్రుఁడు కాఁజాలఁడు. తనవిధిని చక్కగ నెరవేర్పవలెనను నభిలాషగల ప్రతిసభ్యుఁడును ఈవిషయమున మిక్కిలి శ్రద్ధ తీసికొనవలయును. శాసననిర్మాణసభ్యత్వము కొందఱనుకొనునట్లు గౌరవము కొఱకేర్పడినదికాదు. ఇదియొక మహాభారము. మనశాసననిర్మాణసభాసభ్యులీవిషయమునఁ జాల ఉపేక్ష వహించుచున్నారు. వారికి దేశీయవార్తాపత్రికలన్న కేవల మయిష్టము. ఆంగ్లేయభాషావిశారదులు నూటికిద్దరైన లేనప్పుడు ప్రజాభిప్రాయము లాంగ్లేయభాషలో నెట్లు లభింపఁగలదు? ఏవిషయమున ప్రజాభిప్రాయము గావలసియుండునో ఆవిషయమునుగూర్చి దేశభాషాపత్రికలలో నీసభ్యులు వ్యాసములు వ్రాయించుచుండవలయును. అందు ప్రకటింపఁబడు వ్యాసములను తాము చదువుచుండవలయును. దేశభాషయన్న తమకెంత తలకంటగింపుగనున్నను ఈసభ్యత్వపదవియందుఁ గల యితరకష్టములతోపాటు దీనిని గూడ నోర్చి దేశభాషాపత్రికల నొక్కింత యాదరింపవలయును. రెండవది ఒక్కరైనను తామెన్నుకొనఁబడిన ప్రదేశములయం దధమము తమ నియో

మితకాలమం దొక్కసారియైనను తిరిగి ప్రజాభిప్రాయములను గైకొనుటయందును, ప్రజలకు రాజకీయవిషయములను బోధించుటయందును లక్ష్యముంచినవా రింతవరకుఁ గన్పట్టలేదు. ప్లాటుఫారమెక్కయుపన్యాసమిచ్చుచు సభ్యత్వపదవికి సమయమెప్పుడు వచ్చునాయని నిరీక్షించువారిలోఁ గొందఱకును, సంశయించువేల! కొందఱు సభ్యులకును గూడ ఈలోకజ్ఞానము చాలతక్కువ. గతసంవత్సరమున నిడదవోలునందు జరగిన కృష్ణా—గుంటూరు మండలసభయం దీవిషయమును మేము చూచియున్నారము. ప్రథమదినమున గా॥ గోక్లేగారి నిర్బంధోచితవిద్యాశాసనము మొదలగు నాలుగైదు విషయములను గూర్చి విపులముగ చర్చించి గంభీరధ్వనులతో నుపన్యాసములిచ్చి తీర్మానించిరి. ఆవిషయములన్నియు నదివఱ కాంగ్లేయవార్తాపత్రికలయందు చర్చించి చర్చించి విడిచిపెట్టఁబడినవే. ఆనాటియుపన్యాసకులు వాని నాంధ్రీకరించిరి. మఱునాఁడు రయితులతో సంబంధించినట్టియు, భూములతో సంబంధించినట్టియు, తోటపయిర్లపైని తీర్వ, సీటిసప్లయి, కుండతూములు, మొదలగు నిరువదిముప్పది విషయములాలోచనకుఁ దేఁబడినవి. మూఁడేసినాలుగేసి విషయములు గుది గ్రుచ్చఁబడుటయేగాక ఒక్కొక్కతీర్మానము కొన్నినిమిషములతో పరిసమాప్తి నొందినది. ఉపన్యాసకులు లెక్కకు తక్కువైరి. పెద్దపెద్దలూరకుండిరి. చెప్పినవానిలో నైనను సారము లేదు. అనుభవములేనివారివలె స్పష్టముగ గనుపడిరి. మాకెక్కడ నలవాటులేదు కాని మాయూరరావిచెట్టుక్రింద దిమ్మపై గూర్చుండి చెప్పమన్నచో ప్రజలకు గలుగుచున్న కష్టములు వానిని తొలఁగించు మార్గములను గూర్చి యింతకంటెబాగుగ చెప్పగలుగుదుమని యిద్దరుముగ్గురు ముసలిరైతులనుచుండ మేము చెవులార విన్నారము. కావున నిట్టి యనుభవజ్ఞానశూన్యులు సభల నలంకరించిన ప్రజలకెట్టిలాభములు చేయఁగలవో చదువరు లూహించెదరుగాక!

దేశమందు మొత్తముమీద ప్రజలకు గల కొరంతలెవ్వి? వాటినే యేయుపాయములవలనఁ బరిహరింపవచ్చును? అనువిషయములఁగూర్చి సభ్యుఁడెప్పుడు నాలోచింపుచుండవలెను. గోక్లేమున్నగు రాజకీయపారంగతుల కీవిషయములు చక్కఁగ నలవడినవి. అట్టిమహనీయులే ప్రతినిధినామమును సార్థకబఱచువారు. ప్రస్తుతము మనజిల్లాలకు ప్రతినిధిగానున్న మ. రా. శ్రీ మోచర్ల రామచంద్రరావుపంతులుగారికి కూడ గోక్లేగారివలెనె యిట్టిసామర్థ్యముగలదు. కావుననె దొరతనమువారి పక్షముననున్న సభ్యులలో నొకరగు స్టూఅర్టుగారిచే శ్రీరామచంద్రరావు పంతులుగారు "దక్షిణయిండియా గోక్లే"యని పిలువబడిరి. ఇట్టివారు సభ్యత్వమువహించిన ప్రజాస్వాతంత్ర్యములుకై హెచ్చుగ పాటుపడగలరని మాయభిప్రాయము.

ఇఁక ప్రతినిధులయెడ ప్రజలెట్లు ప్రవర్తింపవలెను? ప్రజలు నిర్వహింపవలసిన విధులెవ్వి? అనువిషయములను గూర్చి చెప్పవలసియున్నది. ప్రజలు తమకుఁగల కొఱంతలను సభ్యునికి నివేదించుకొని వానిద్వారా దొరతనమువారిని తమకు గావలసిన సదుపాయము లొనరించునట్లు ప్రార్థింపవలయును. ప్రజలలో కొందరు సభ్యునితోముందు ప్రదేశములకు గొంపోయి తాము పొందుచున్న యిబ్బందులను ఆతనికిఁ జూపవలెను. స్వయముగ జూచినపిమ్మట సభ్యుఁడు, యిరిగేషన్, శానిటేషన్ యీమొదలగువాటియందు కావలసిన మార్పులను దొరతనమువారికి నివేదింప సామర్థ్యము గలిగియుండును. ప్రజలు నిర్వహింపవలసిన విధులలో ముఖ్యమైనది రాజకీయవిద్యను వ్యాప్తినొందించుట. ఇంచుక హూణభాషాజ్ఞానము తెలిసినవారును, భూవసతియే ముఖ్యజీవనోపాధిగా గలవారును తాముచేయుచున్న వ్యాపారములందు కొంచెము తీరికజేసికొని యీసభలలో జరుగుచున్న కార్యక్రమము పత్రికాముఖంబున తాము తెలిసికొని ప్రజలకు బోధింపవలయును. మనలో విద్యాగంధములేని ప్రజలనేకులు గలరు. వారందరికి, యీబోర్డులు, మ్యునిసిపాలిటీలు, యీచట్టనిర్మాణసభలుయొక్క చరిత్ర పూర్ణముగ పూసగ్రుచ్చినట్లు తెలియజేయవలెను. ఈసభలెందులకు స్థాపింపబడినవియు, వాటియుపయోగ

ములు, వాటిలో కావలసిన మార్పులు, వాటిలో సభ్యులుగానుండదగిన వారిని నెన్నుకొనుట యీవిషయములను జనబాహుళ్యమునకు విశదీకరించుచు, ప్రజాస్వాతంత్ర్యములన్న నెట్టివియో వారెరుంగునట్లు జేయుట హూణవిద్యనవలంబించిన స్వల్పసంఖ్యగలవారిదియై యున్నది. ఏవిషయములైన గ్రహించుటకు విద్య మూలాధారమగుటచే దానిని దేశమందెల్లెడల వ్యాప్తినొందించు మార్గము ప్రజలే యాలోచింపవలయును. ఏదేశముగాని సకలవిధముల నభివృద్ధిజెందుటకు మూలాధారము విద్యయని యూహించి, అట్టివిద్యవలన తోడిదేశములెట్టి యౌన్నత్యమును వహించినవియు కండ్లారజూచి మనవిధిని నెరవేర్ప ప్రయత్నింపవలెను.

ఈసభలెట్టి యుపకారములను మనకు గావించుచున్నవి? అను విషయమును గురించి చర్చింపవలసియున్నది. ఈశాసననిర్మాణసభలలో జర్చింపబడు విషయములు ద్వివిధములు. కొన్నితీర్మానములు ప్రజాపక్షమున నెన్నుకొనబడిన సభ్యులచే తేబడి వారిచే నుపపాదింపబడును. మరికొన్ని రిజల్యూషన్లు దొరతనమువారిచే నియమింపబడిన సభ్యులచే తేబడి ఆసభ్యులచే నుపపాదింపబడును. ఈరెండురకముల తీర్మానములు గూడ నుభయపక్షముల సభ్యులచే చర్చింపబడి సభ్యుల యంగీకారమునకై విడచిపెట్టబడును. అప్పుడు హెచ్చువోట్లు వచ్చిన తీర్మానము దొరతనమువారి శాసనముగా ప్రకటింపబడును. ఆశాసనము జిల్లాగెజెట్లలలో ప్రకటింపబడును. ఆశాసనము ననుసరించి ప్రజలు ప్రవర్తింపవలసియున్నది. ప్రజాపక్షమునుండు సభ్యులచేత తేబడిన తీర్మానములు సాధారణముగ ప్రజల స్వాతంత్ర్యములను పురస్కరించుకొని యుండును. ఇందులకుదహరణము శ్రీగోక్లేగారిచే తేబడిన “దేశములో ప్రజలందరకు నిర్బంధోచితవిద్యనొసంగవలయును” తీర్మానము. ఈతీర్మానము కలకత్తా గవర్నర్ జనరల్ గారి శాసననిర్మాణసభలో ననేకపర్యాయములు శ్రీ గోక్లేగారిచే తేబడి గవర్నమెంటువారిపక్షమున నున్న హెచ్చుసంఖ్యగల సభ్యులచే త్రోసివేయబడెను. ఇన్నిసారులీ తీర్మానము త్రోసివేయబడినను ఊరకపోలేదు. ఫలితము గలదు. శ్రీచక్రవర్తిగారు మనదేశమందు పట్టాభిషిక్తులయినప్పుడు మనదేశములో

విద్యాభివృద్ధినిమిత్తము కొన్ని లక్షల నిచ్చిరి. ఇదిగాక 'యిండియాసేటు సెక్రిటరీగారు యిప్పుడున్న పాఠశాలలకు నూటికి 75 వంతున మనదేశమందు పాఠశాలలు వృద్ధిచేయునటుల తీర్మానించితిమని సెలవిచ్చియున్నారు. దొరతనమువారిచే త్రోసివేయబడిన మరియొక తీర్మానముయొక్క ఫలితమును జూచెదము. చెన్నరాజధాని చట్టనిర్మాణసభలో లోకల్‌బోర్డులకు ప్రెసిడెంట్లు ఆయాబోర్డులలోని సభ్యులచే నెన్నుకొనబడిన దొరతనమువారి ఉద్యోగపదవిలో నుండని విద్యాధురీణులుండునటులొక తీర్మానము తేబడెను. ఈతీర్మానముగూడ దొరతనమువారి పక్షమునను ౨ హెచ్చుసంఖ్యగల సభ్యులచే త్రోసివేయబడెను. ఈతీర్మానమిటులు త్రోసివేయబడినను ఊరకపోలేదు. దీనినిగూడ దొరతనమువారు మన్నించిరనియే మాయభిప్రాయము. ఏలయన చెన్నరాజధానిలోని కొన్నిబోర్డులలో కొందరు లాయర్లగా నున్నవారికి (Non-Official Presidents) యీబోర్డులకు ప్రెసిడెంట్లుగా నియమించిరి. ఇటుల చేయుటలో దొరతనమువారిచే నియమింపబడిన ప్రెసిడెంట్లు నేటివ్‌లైయున్నను వారుతమ పదవిని జయప్రదముగ నిర్వహింపగలరో లేరోయని మచ్చుచూచుటకు చేసినట్లు తోచుచున్నది. దొరతనవారి యభిప్రాయము పూర్ణముగ గ్రహించి యిప్పుడు నియమింపబడిన ప్రెసిడెంట్లు తమపనిని జయప్రదముగ నిర్వహించి తోడివారికి మార్గదర్శకులై ప్రజలచేతను దొరతనమువారిచేతను శ్లాఘింపబడుదురని మాయాశయము.

చదువరులారా! గ్రహించితిరా యీసభలయొక్క యుపయోగములు. "అడిగినగాని అమ్మయైన బెట్ట" దన్నసామెత ననుసరించి ప్రజలు జ్ఞానవంతులై తమస్వాతంత్ర్యములకై దొరతనమువారిని తగురీతిని వేడినదో నేదియు వృథగాపోదు. మరియొకరూపముగనైన దాని లాభము మనము గ్రహింతుము. కట్టుబాట్లతో జయప్రదముగ నడుపఁబడుచున్న బ్రిటిషుసామ్రాజ్యముయొక్క పరమావధి ప్రజలు జ్ఞానవంతులై పాలకులతో సరిసమానముగ స్వాతంత్ర్యములను నొందునటుల జేయుటయే.

శ్రీరస్తు.

# విజయవిలాసకృతివిమర్శనము.

చ॥ క్షితిపయి వట్టిమ్రాఁకులు చిగిర్ప వసంతుఁడు దా రసోపగుం
భితపదవాసనల్ నెఱప, మెచ్చక చంద్రుఁడు మిన్నునం బ్రస
న్నతయును సౌకుమార్యముఁ గనంబడ ఱా ల్గరఁగంగఁ జేసె; నే
గతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే కదా!

"విజయవిలాసము"

అని చెప్పిన ట్లొకని మించినకవిత్వ మొకఁడు చెప్పఁ గలఁ డనుటకు సందియము లేదు. ఒకఁడు కొంచెము శ్రమచేసి రసోపగుంభితశబ్దార్థభావంబులు విస్తరింప, నింకొక డశ్రమంబునన ప్రసాదసౌకుమార్యకాన్త్యగుణంబులు గనంబడ గ్రంథములు చెప్పి రెట్టివారిచిత్తంబుల నైన నిగుర్పొత్తించు ననుటకు సందియము లేదు. ఎం తెట్లు రచించినను ఎట్టిరసవత్తర మైనను సమకాలము వారు మెచ్చుకొన రనుటయే నిశ్చయము. మహాకవి కాళిదాసుఁడు జీవించి యున్నకాలమున నతనికవిత్వమును మెచ్చక దండిభవభూతిశంకరాదులే కాక నిచుళుఁ డనుకవియు మిక్కిలి ద్వేషించి దూషించినట్లు గ్రంథప్రమాణములవలనం దెలియఁ బడుచున్నది కదా! ఇప్పు డమ్మహాకవికవిత్వ మెట్లు శ్లాఘింపఁ బడుచున్నదో జగదేకవేద్యంబ, మఱియు భవభూతి యుత్తరరామచరిత్రలో "కాలో హ్యయం నిరవధి ర్విపులా చ పృథ్వీ" అని చెప్పుకొనుటచేత నక్కాలమున నతనికిని మెప్పు రా లే దనియుఁ దెలుఁగులలో శ్లేషయమకచక్రవర్తి సార్వభౌముం డగురామరాజభూషణకవిఁ గవిత్వంబున నప్పటివా రెట్టిమెట్టిదిక్కులం బెట్టిరో యిప్పటికిని దెలియఁ బడుచున్నది. వసుచరిత్రమునందు మొదటిపద్యములో నజుచేతిబూడెలో శ్రీకారము వ్రాసి "భూ" యని నోటిగాలిచే బూడె యెగిరిపోఁ జేసి యీగ్రంథము వలన శ్రీ యెగిరి పోవు నని రాజునకుఁ జెప్పి యొప్పించియు,

“గీ॥ అల్లసాని పెద్దన యల్లిక జిగిబిగి। ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు
పాండురంగవిభుని పదగుంభనంబును। గాక మాను రాయ నీక తగుర॥

క॥ చీపరపాపరతీఁగలఁ। జేపలబు ట్టినట్లు చెప్పెదు నీయీ
కాపుకవిత్వపుమాటలు। బాపనకవివరుని చెవికిఁ బ్రియదం బిడునే”

అని యెన్నో పద్యములు చెప్పియుఁ దెనాలి రామకృష్ణాదులు నిరసించి యుండిరని వినుచుందుము. వేయేల ప్రస్తుత మే సామాన్యుఁడు చేసినదైన నొక్క పద్య మొకపత్రమున వ్రాసి యిది నన్నయభట్టారకునిమహాభారతములోని దని చెప్పి యేపండితునియొద్ద కైనం గొనిపోయి చూపినచో నం దెన్నితప్పు లున్న నవి యొప్పు లని చెప్పుచు నతం డందలిమాధుర్యం బింతింత యని చెప్ప లే మని దానిం గొనియాడుచు నంతలో నది సామాన్యుఁడు చేసినదే యని నిర్ణయింపఁ బడఁగా హరహరా! నన్నయభట్టు పద్యమనుకొని తప్పులు లే వని మెచ్చితిని ఛీఛీ! యీపద్యమం దన్నియుఁ దప్పులే యిది యెందులకుం బనికి మాలినపాడుపద్య మని తిరస్కరించును. ఇది మనప్రపంచమున సనాతనధర్మమై నచ్చుచున్నయాచారమై యున్నయది. మఱియు పూర్వకవివిరచిత గ్రంథ మొకఁ డుండ మరల నిప్పటివాఁ డొకఁడు దానికన్న మిన్నగాఁ జేయుటకుఁ బ్రయత్నించి చేసినను దానిం దిలకింపక యే కొందఱు మూర్ఖులు “పనిలేనిమంగలి పిల్లితల గొఱిగినట్లు--పులిని జూచి నక్క వాతలఁ బెట్టుకొన్నట్లు” ఉన్నది యని చూపోపక తిరస్కరింతురు. అని చెప్పుటంజేసి వస్తుగుణాగుణముల నెల్లడించుట తప్పని నాయభిప్రాయము కాదు. కువిమర్శనముఁ జేయుటకూడనిమాట. వాఁ డిహపరంబులకు వెలియగును. ఎట్టివారికిని గుణదోషంబులు రెండు నుండి తీరును. సువిమర్శకుండు న్యాయైకబుద్ధితోనవి విమర్శించి ప్రకటించుట పాడి. వానికి నిందు నందు మే లందఁ గలుగు. అది యట్లుండుఁ గాక.

పిల్లవసుచరిత్ర మని ప్రఖ్యాతిం గాంచి సుభద్రాపరిణయ మను నామాంతరమున వ్యవహరింపఁ బడుచున్నవిజయవిలాస మనుమూఁడాశ్వాసముల పద్యకావ్యము “చేమకూర పాకమునం బడినది” యనుప్రసిద్ధికిం దానకం బగునట్లు తంజాపురీశ్వరుం డగు రఘునాథరాజున కంకితము గాఁ దదాస్థానంబున నుండుచేమకూర వేంకటరాజకవిచే సుమారు 400 సంవత్సరముల క్రిందట రచియింపఁ బడినది. కృతిపతి యగురఘునాథ రాజు:—

చ॥ ప్రకటశ్రీహరియంఘ్రిఁ బుట్టి హరుమూర్ధం బెక్కి యాపాదమ
స్తకముల్ వర్ణన కెక్కుదేవి సహజోదంచత్కళోత్పన్ననా
యకరత్నం బని యచ్యుతేంద్రరఘునాథాధీశ్వరస్వామికిన్
సకలైశ్వర్యములన్ నిజేశువలనం దాఁ గల్గఁగాఁ జేయుతన్॥

క॥ ఆరాజశేఖరప్రియ । వారిజముఖి తోడుగాఁగ వర్ధిలు విమల
శ్రీరుచిరవర్ణమున ధా । త్రీరంజనసుకృతి చెవ్వ నృపతి జనించెన్॥

అని విజయవిలాసపీఠికయందు వ్రాయఁ బడియున్న పద్యములవలన శూద్రుఁ డని స్పష్టపడుచున్నది. విజయనగరాధీశ్వరుండగు కృష్ణదేవరాయలవంశమువారికిని వీరికిని చుట్టరిక మున్నట్లు తెలియ వచ్చుచున్నది. పైకందమున నుదాహరింపఁ బడిన చెవ్వ నృపాలుఁడు కృతిపతికిం బితామహుండును, కాంచ్యరుణాచలవృద్ధాచలంబుల గోపురావరణంబులఁ గట్టించినవాఁడును కృష్ణదేవరాయలకుఁ దమ్ముఁ డగు నచ్యుతదేవరాయల దేవి యగు తిరుమలాంబకు ననుజయగు మూర్తిమాంబను దేవేరి గాఁ గొన్నవాఁడును నామెయందు నచ్యుతేంద్రుఁ డను కొడుకుం గన్నవాఁడు నై యున్నవాఁడు, ఈయచ్యుతేంద్రుఁ డే మనకృతిపతికిం దండ్రియును శ్రీరంగనాధునకు విమానంబును మణిమయకిరీటాదులు నిర్మించినవాఁడును మణితులాభారంబులు దూఁగుటకు మార్గదర్శకుండును. అతనికి మూర్త్యంబయందు గృతిపతి యగురఘునాథరాజభ్యుదయంబు నొంది శౌర్యనిధి యై శత్రుసంహారంబు గావించి జలదుర్గస్థలదుర్గాదు లనేకములు వడసి దానకర్ణుం డై షోడశమహాదానంబు లనేకవారములు నొనరించి రామభక్తుం డై చతుష్షష్టికల లెఱింగి విద్వాంసుం డై మంచికవిత్వము చెప్ప నేర్చి యభినవభోజరాజబిరుదంబు నొంది క్రీ. శ. 1614—1630 సంవత్సరములలోఁ దంజావూరు రాజధాని గాఁ జోళసింహాసనాధ్యక్షుం డై దక్షిణదేశంబు పరిపాలించి యపుడు దక్షిణనాయకుండు నాఁ బడియె. అతని సుతుం డగు విజయరాఘవరాజు 1674 వ సంవత్సరమున మధురాపురము రాజధాని గాఁ గలపాండ్యదేశాధీశుఁ డగు చొక్కలింగము నాయకునితో యుద్ధము చేసి నిహతుం డై నట్లు చరిత్రశోధనలవలనఁ దెలియ వచ్చుచున్నది. కావున దీనింబట్టి విచారింప నీవిజయవిలాసము 17 వ శతాబ్దప్రారంభమున రచింపఁ బడిన ట్లూహింప నై యున్నయది.

కృతికర్త యగు చేమకూర వేంకటరాజు సారంగధరచరిత్ర మను మఱియొక ప్రబంధము రచించి యదియును రఘునాథరాజునకే యంకితము చేసి యున్నాఁడు. అందుఁ గృతిపద్యములు నాశ్వాసాద్యంతపద్యములును విజయవిలాసములోనివే చూపట్టుచున్నవి. ఈరెండుగ్రంథములయందును గవి తనవంశావళికమును గూర్చి యించు కంతయుం జెప్పికొని యుండ లేదు. కాని యాశ్వాసాంతగద్యములయందు “ ఇది శ్రీసూర్యనారాయణవరప్రసాదలబ్ధసారస్వతసుధాసారజనితయశోలతాంకూర, చేమకూరలక్ష్మణామాత్యతనయ...” అని మాత్రము చెప్పుకొని యున్నాఁడు. దీనింబట్టి విచారింపగా నమాత్యశబ్దము నియోగిబ్రాహ్మణుల తెగకుం జెంది యుండుటం జేసియు, ద్వాత్రింశన్మంత్రిచరిత్రమునఁ జేమకూరప్పరాజనునొకనియోగిబ్రాహ్మణుఁ డుండినట్లు వర్ణించుటం జేసియు, మనగ్రంథకర్త యగు చేమకూర వేంకటరాజు నియోగిబ్రాహ్మణుఁ డేమో యని సందేహింప వలసి యున్నది కాని పీఠికయందు శూద్రుఁ డైనరఘునాథభూనాథునిం గూర్చి:—

ఉ॥ ఏలినమాత్రమే మహిమ నీశ్వరుఁడే విచారించి చూడ నా
పాలిటిరామభద్రుఁ డని బంగరుఁబూవులఁ బూజ చేసి నేఁ
జాల నలంకృతిం బొసఁగుసత్కృతి కానుక చేసి గీర్తి భూ
శ్రీలలితాంగులన్ వలనఁ జేసిన శ్రీరఘునాథశౌరికిన్॥

ఇందు నాపాలిటిరామభద్రుఁ డని కవి, తాను బంగరుఁబూలఁ బూజ చేసి యని చెప్పుటచేతను,

ఉ॥ శ్రీరసభావముల్ దెలియఁ జెప్పి ప్రబంధము లెన్నియేని మీ
పేరిట నంకితం బిడిన బిడ్డల నెందఱఁ బేరు పెట్టినన్
దీరునె మీఋణం బయినఁ దెచ్చితిఁ గాన్క పరిగ్రహింపు మ
య్యా రఘునాథభూపరవికాగ్రణి మామక కావ్యకన్యకన్॥

గీ. అట్టు లోడ్డోలగం బున్నయవసరమున
వినయభయసంభ్రమములు నావెంట నంట
ననుఁ గృపాదృష్టిఁ జల్లఁగాఁ గనుమనుండ
సమ్ముఖమ్మున కరిగి యంజలి ఘటించి.

అని యిందుఁ “బ్రబంధము లంకితములు చేసి బిడ్డలకు మీపేరు పెట్టినను మీఋణము తీరదు” అని మ్రొక్కినట్లు చెప్పుకొనుటచేతను మఱియు ననేకస్థలముల బ్రాహ్మణకవులే

గాక భట్టుమూర్తి మొదలగువారును జెప్పుకొనినట్లు గాక రాజునుగూర్చి నీచముగాఁ జెప్పుకొని యుండుటచేత నీతఁడు బ్రాహ్మణుఁడు గాడనియు, చేమకూరలక్ష్మణామాత్యుఁ డనునియోగిబ్రాహ్మణునికి భోగినీపుత్త్రుఁ డనియు మనవారు నిర్ణయించి యున్నారు. నీచజాతిశూద్రుఁడు గనుకనే వేంకటరాజకవి తనవంశాదికమునుగూర్చి చెప్పుకొనుటకు సిగ్గుపడి యుండు నని యూహింపనై యున్నయది. మఱియు నీయర్థమును బోషించుచు వాసిరెడ్డివేంటాద్రినాయఁడుగారియొద్దఁ గవియై భోగినీపుత్త్రుఁ డయిన బుచ్చివెంకను దదాస్థానబ్రాహ్మణకవులు భోగినీపుత్త్రుఁ డని పరిహసింపఁగా రాజుతో నాతఁడు:—

ఉ॥ పన్నినసత్ప్రబంధముల బాగును నోగును జూడ కీసుచే
మన్నన మాలి మాకులము మాట దలంతురు; చేమకూరవెం
కన్నకు లోప మేమి? కులమా కనవానకు? వేంకటాద్రిరా
జన్న! గణించి మీరలు దయామతిఁ బ్రోచిన నాకుఁ జాలదే॥

అని సమాధానము చెప్పికొనియె నఁట. దీనింబట్టి చూచినను వేంకటరాజకవి శూద్రుఁ డనియే తోఁచుచున్నది. ఈవిజయవిలాసమును 1901 వసంవత్సరమునఁ బోలవరముసంస్థానాధిపతులును సరస్వతీపత్త్రికాధిపతులు నగుశ్రీకొచ్చర్లకోట రామచంద్రవేంకటకృష్ణారావుబహద్దరు బి.యే గారిచే సంస్కరింపఁబడి ముద్రింపఁబడినది. దానిపీఠికలో జమీందారుగారు వేంకటరాజకవి రఘునాథరాజునొద్ద నొకయుద్యోగపదమం దుండునీచజాతిశూద్రుఁ డనియే నిర్ణయించుచుఁ గొన్నిప్రమాణము లగపఱచినారు. మదరాసుక్రిష్టియన్ కాలేజియందు సంస్కృతోపాధ్యాయులుగా నుండి ప్రస్తుత ముపకారవేతన మొంది యున్న బ్రహ్మశ్రీవేదము వేంకటరాయశాస్త్రులుగారు 1911 వసంవత్సరము స్వవిరచితవ్యాఖ్యతో సంస్కరించి ముద్రింపించిన విజయవిలాసపీఠికలో “ఈచేమకూరవేంకటరాజకవీంద్రునికుల మేదో చరిత్రశోధకులు ఇప్పటికిని నిర్ణయింప నేరకున్నారు; శూద్రుఁ డని యూహలు సేయుదురు” అని వ్రాసినారు. ఇత్యాదులం బట్టిచూడ వేంకటరాజు శూద్రుఁ డని మనము నిర్ణయించుకొనుటయే సమంజస మని నాయభిప్రాయము. మఱియు “వేంకటరాజు” అని పేరుఁగలనను, రాజు కవితో

“గీ॥ క్షత్త్రధర్మ మెమ్మె కద నీకుఁ గలది మొదల...” అని చెప్పుటచేతను ఇతఁడు క్షత్త్రియుఁ డేమో యని కొందఱు సందేహింప వచ్చును. కాని రాజు పేరులు రా

గాక బ్రాహ్మణులు మొదలగువారికిని గలిగియుండుట మన మెఱింగి యున్నారము. ఆర్వేలనియోగిబ్రాహ్మణుండయి యుత్తరరామాయణ మొనర్చి ప్రసిద్ధిఁ జెందినకవి "కంకంటిపాపరాజు" అని పిలువంబడుచుండెను. మఱియు నిట్టిరాజశబ్దవాచ్యులు నియోగులలో ననేకులు గలరు. కావునఁ బేరునుబట్టి రా జనుటకు వలనుపడదు. క్షత్త్రియుఁడే యైనచో "క్షత్త్రధర్మ మెక్క కద మొదల నీది" అనుదానిలో స్వారస్య మేమియు నుండదు. క్షత్త్రధర్మము మొదల నుండి యప్పుడు లేకుండె నని తోఁచెడిని. దీనివలనను క్షత్త్రియత్వమును నిర్ణయించుటకు వలనుపడదు గాని "క్షత్త్రధర్మ మెక్క కద మొదల నీది" దీనిలోనివిశేష మేమియో గ్రహింపరా కున్నయది. వేదము వేంకటరాయశాస్త్రిగారు దీనిపూర్వోత్తరపద్యములకు టీక వ్రాసి దీనికి నేమికతంబుననో దిక్ప్రదర్శనముగా నైన టీక వ్రాయ లేదు. అది యటుండ నిందు పై నుదాహరించినపద్యములయందలి నైచ్యానుసంధానంబునంబట్టి యక్కవి శూద్రుఁ డని మనము నిర్ణయించుకొంటిమిగదా. కాశీఖండములో శ్రీనాథుఁడు "వేమభూపతికృపావీక్షణంబు" అని మొదలైనచోట్లయందును దక్కినమఱికొందఱు బ్రాహ్మణకవులు రాజాదులకుం గృతు లిచ్చి తమగ్రంథములందు నైచ్యమును జూపియున్నారు. దీని కేమి సమాధాన మందు రేని, అది రాజునందలిగౌరవమును జూపుట కాని నైచ్యము కా దనియు నెవ్వరు "పువ్వులఁ బూజ సేసి మ్రొక్కి భక్తితో గ్రంథము సమర్పణము చేసెద" నని తమగ్రంథములఁ జెప్పుకొనియుండలేదు. కావున నితఁ డెట్లుచూచినను శూద్రుఁ డే యనియు చేమకూరలక్ష్మణామాత్యునిభోగినీపుత్త్రుఁడు గాన నతనియింటిపేరు వెట్టుకొనియె ననియు నిశ్చయించుటయే సమంజసము. ఇతనికి వెంకన్న, వేంకటపతి, వేంకటరాజకవి, యని పేళ్లు గలవు. మొదట వెంకన్న, సారంగధరచరిత్రము రచించి వేంకటపతి, విజయవిలాసము చేసి వేంకటరాజకవి, యిప్పుడు వేంకటరాజకవిశేఖరుఁడు, అని పిలువంబడుచుండె. మఱియు నిక్కవికులగోత్రంబులం గూర్చి నిర్ధారణ చేయుట కింతకన్న నెక్కువగా నాధారము లేమియు నెందునుం దొరకలేదు గావున నవ్విషయ మింతతో ముగించి "చేమకూర చక్కెరమడిలో నమృతము పాఱించి పెంచినదిగాని మట్టిలో నీరు పాఱించి పెంచినదిగా"నని ప్రసిద్ధి వహించి యమృతంపుఁగూర వేంకటపతి యనం దగిన చేమకూరవేంకటపతి కవిత్వమహత్త్వముం గూర్చియు విజయవిలాసరచనాచమత్కారాదికంబును గూర్చియు నించుక చర్చించుకొనుచుఁ విమర్శించి ప్రస్తుతమునకు వత్తము.

శా. కాంతారంబున గోపికావనులు ని న్గాంక్షించి ప్రేమింప వి
భ్రాంతుల్ బట్టగ జేసి కానఁబడకే రాధాపుల న్బెట్టి తా
వింత న్జేయకు నామనోనిలయము న్వీక్షించి నిత్యంబుగా
సంతోషంబున నుండు మోయభవ కృష్ణా భక్తచింతామణీ.

మ. పగల న్జెందక యుండ గావుము హరీ వైకుంఠ యోమాధవా
పగలున్ రాత్రిలు నీపదాబ్జవలతోఁ బాటిల్లఁగాఁ జేయవే
నిగమాంతార్థవిభాసమాన వరదా నిత్యా యనంతాహ్వయా
జగదానందకరుండ వీవె కద కృష్ణా భక్తచింతామణీ.

మ. వితతంబైన దురాశలన్ దగిలి భావింపంగ రాకున్న దై
ధృతివానంబుగఁ జేయు కామమెపుడున్ దీనత్వమున్ జేయు నా
తతమాదీనిని మాన్పనాకు వశమే తాత్పర్యచిత్తుండ వై
చతురత్వంబున మానజేయు మిఁక కృష్ణా భక్తచింతామణీ.

మ. ధనవంతుల్ మదచిత్తులై దలఁపఁగాఁ దాక్షిణ్య మేవేళలన్
గనరా దించుక గాన జ్ఞానధనమున్ గాంక్షించి యే వేఁడెదన్
మునిచూడామణిజాలపోష దయచే ముఖ్యంబుగా నీవలెన్
జనునే నిర్దయ నూరకుండుటలు కృష్ణా భక్తచింతామణీ.

మ. భువి జన్మించినవార లంద అపుడు న్బ్రభాత్ములై యుండకే
చెవులన్ లోకకథానురాగు లగుచున్ జిత్రింబుగాఁ దోచు శ్రీ
ధవ నీసేవలుచేయరారు మదిలోఁ దాత్పర్యచిత్తుండనై నవిశే
షంబుగ నిన్నుఁ గొల్చెదను కృష్ణా భక్తచింతామణీ.

శా. క్షీరాన్నంబు భుజింపలేక కలిని న్నీవించుచందంబునన్
నేరం బెంచెడు వాని జేరి సుజనున్ నిందించుచందంబునన్
జేరం జెన్నఁడు మూఢచిత్తుఁడు మహాచింతాకులుం డయ్యు సం
సారంబే పరమార్థ మంచుఁ గను కృష్ణా భక్తచింతామణీ.

మ. అమరేంద్రార్చిత పాదపద్మ వరదాహంకారహీనా హరీ
విమలాంతఃకరణా మహాపురుష విశ్వేశా గదాపాణి నీ
కమనీయోజ్జ్వలపాదపంకజముల న్గన్నారగాఁ జూపవే
సమదాటోపయఘూరిఖేదహర కృపా భక్తచింతామణీ.

మ. కృపచేత న్ననుఁ గావుమెల్లఘుడు ని న్గీర్తింప నేఁ జాల నే
తపము న్జేయఁగఁజాల నిన్ను మదిలోఁ దల్పంగనుఁజాల నే
కపటంబు న్విడ జాల నీమహిమల న్గన్పట్టగాఁ జాల నే
జపమున్ జేయఁగఁ జాలఁ జక్రిధర కృష్ణా భక్తచింతామణీ.

మ. అపరాధంబుల పెక్కుజేసితి మహాహంకారుఁడ న్మత్తుఁడ
న్విపరీతంబులు దల్చువాఁడఁ జెలివిన్ వేగించి యీపొట్టకై
నృపుల న్జేరి వసించువాడ మదిలో నీసేవల న్దల్ప నా
చపలత్వం బెఱుమాన్పి ప్రోచెదవొ కృష్ణా భక్తచింతామణీ.

మ. చిరకాలం బతిసేవ జేయుదుము నీచింతారతి న్నిల్పుచు
న్వరవిజ్ఞానము గల్గువారలకు నద్వైకుంఠ మీ నోప కే
దురితంబుల్ గరిమంబులంచుఁ బహునాదుష్టాత్ములౌ వారినీ
సరిగాఁ బోరగ మోక్షమిచ్చెదవు కృష్ణా భక్తచింతామణీ.

మ. ఉదయంబౌ సమయంబునందుఁ గలలో నుప్పొంగుచున్ లక్ష్మితో
సదయా నందకుమార నాగృహముకై సంప్రీతితో రాగ నా
మది నుత్సాహము బుట్టి గద్దెలిడి నేమం బొప్ప గంధంబు బూ
తదగన్ దేహము నంటినాఁడగద కృష్ణా భక్తచింతామణీ.

శా. తాంబూలంబుల నిచ్చి నాఁడను మహాతాత్పర్యచిత్తంబునన్
బింబోష్ఠీసహితంబుగాఁ గొనియు సంప్రీతాత్ములై యుండ వే
సాంబారాధనప్రీతచిత్తులమదిన్ సంతృప్తి యెట్లౌను మీ
సాంబుం జూచినరీతిఁ జూడ వలె కృష్ణా భక్తచింతామణీ.

"నేననేక పక్షులను గూడ చంపితిని."

"నేఁ జెప్పినవాక్యములను వినవిష్టముండెనేని ఇఁకముందెన్నఁడు నట్టివి యొనర్పకుము. నేను చక్కఁగా గురిపెట్టఁగలను. నేను తలంచికొన్నచో నిట్టిలేళ్లను పందలఁకొలఁదిగ సులభముగఁ జంపగలను. కాని యట్టిపనులన్న నాకుఁ గడునసహ్యము. ఈమృగములు చాలనందమైనవి. ప్రేమింపఁ దగినవి. సాధుజంతువులు."

"ఔను. నీవుచెప్పినట్లది క్రూరకృత్యమే. నేనింతవఱకు నీవిషయమును గూర్చి యోచింపలేదు. నాకెవరును జెప్పనులేదు."

"నీవాక్యములనుబట్టి నీవిఁక నెప్పుడును నిట్టికృత్యములొనర్పవని నమ్ముచున్నాడను."

"నిశ్చయముగ నేనెపుడును చేయను. నాకిపుడు సెలవిమ్ము. సెలవయ్యెనేని మరియొకప్పుడు దర్శనము చేసికొనెదను."

"నాకంతకన్న సంతోషమేమి కలదు?"

పిదప చక్రవర్తియును, యువరాజును ఎవరిదారినివారు పోయిరి. వారిరువురును అత్యంతపరిచితులైరి. ఒకరితో నొకరు స్వేచ్ఛగ మాటలాడుకొనుచుండిరి. ఒకరివిషయముల నొకరికి బాహాటముగఁ జెప్పుకొనుచుండిరి. ఇంకను అత్యధికదృఢస్నేహముతో నుండవలయునని గోరుకొనుచుండిరి. మోహనకుమారుఁ డెప్పుడువచ్చునాయని చంద్రసేనుఁ డెదురు చూచుచుండును. వచ్చినప్పుడపరిమితానందనముతో నెదుర్కొని తోడ్తెచ్చి సన్మానింపుచుండును.

"చంద్రసేనా! మనస్నేహమునుగూర్చి యొకప్పుడు మాతండ్రిగారితోఁ జెప్పితిని. ఆయన మనపూర్వుల చారిత్రములఁ గొన్నిఁటిని నాకుఁ జెప్పెను. వానినిబట్టి మనమిరువురమును బంధువులమని నేఁ దెలిసికొంటిని."

"ఔను. మాయమాత్యునివలన నేను నెఱింగితిని."

"కొల్లఁదికాలములో నన్ను రాజ్యాభిషిక్తునింజేసెదనని మాతండ్రిగారాజ్ఞ నొసంగినారు. అప్పుడు మనమిరువురమును అన్యోన్యమైత్రిగల సార్వభౌముల మగుదుము."

"ఔను. మనకుటుంబసంబంధమయిన స్నేహబంధుత్వములమాట యటుండనిమ్ము. మనమిరువురమును అత్యంతప్రాణమిత్రులము కాఁగలము."

"రాజ్యభారము నాపైఁబడకుండునంతవఱకును తఱుచుగా నిన్నుఁ జూచుచుందును."

“సంతోషము. సంతోషము అట్లొనర్చితివేని నిశ్చయముగ నాకధిక సౌఖ్యము నొడఁగూర్చినవాఁడవగుదువు-”

ఇంకొకపర్యాయము సమావేశమగునప్పటికి వారిస్నేహము మఱింత యధికమయ్యెను. ఒకరిచారిత్రముల నొకరు చెప్పుకొనిరి. ఆశ్చర్యమును అభిలాషయును గలుగఁజేయుటలో మోహనకుమారుని చారిత్రము, చంద్రసేనుని జీవితచారిత్రమునకుఁ దీసిపోవునదికాదు. మోహనకుమారుఁడరుదెంచినప్పుడెల్ల చంద్రసేనుఁడు సర్వదా యాతనితోడనే ప్రొద్దుపుచ్చుచుండెను, క్రమక్రమముగ వారలకత్యంతదృఢస్నేహమేర్పడి వారములకొలఁదిగ మోహనకుమారుఁ డింటిలోనే యుండుచు వచ్చెను. ఈవిధమున నొక సంవత్సరము గడచినది. చంద్రసేనునకు పదునాల్గవయేఁడు వచ్చెను. ఆ కుమారునకు పదునేనేండ్లు. ఒకనాఁడు వారిరువురకు నిట్లు సంభాషణ జరిగెను.

“ప్రియమిత్రమా! నీవిక్కడనున్నంతకాలమును నాకెంతో సుఖముగ నుండును. నీవు వెళ్ళినపిదప నేనొంటరిగ నుండవలసివచ్చుటచే నాకేమియుఁ దోచకయట్లో యుండును.”

“ఏమి? మంత్రి, మంత్రికుమారులు. ఇంక నెందఱో—”

“వారందఱు నాకంటె చాలవృద్ధులుగనో, నాయెడ మిగుల వడకువతో వర్తింపవలసినవారుగనో ఉన్నారు. వయసునందును స్థితియందును నాతో సమానులే నాకుఁ గావలసియున్నది.”

“ఎల్లప్పుడును నేను నీతోడ నుండిన” •

“అంతకంటె కావలసినదేమికలదు? ఊరకయనుచున్నాఁడవు. కానినీవిట్లుండువా”

“అట్లయిన నీవొంటరిగ నుండకుండుటకేమి యుపాయమాలోచించితివి?”

“నేను వివాహమాడెదను.”

“ఔను. నీవు పరిణయమాడి చాలమంది పిల్లలను గంటివేని యెల్లప్పుడును వినోదముగా వారలతో నాడుకొనవచ్చును. అప్పుడు ఇప్పటివలెనన్నుజూడవు. నాతోచాల సేపుండవు ఔనా?”

“నీవు నన్నూరక పరిహాసమాడుచున్నావు. నేను యుక్తవయసువచ్చిన కన్యను బరిణయమాడుదునని తలంచుచున్నావా? పది పదునొకండేండ్ల కన్యను వివాహమాడవలయునని నాయభిప్రాయము. నీవు లేనప్పుడు ఆమెతో మాట్లాడుచు వినోదముగా కాలము గడపెదను.”

"అంతటిచిన్నపిల్లను నీతోఁగూడ నుండుటకై పంపు రాజెచ్చటనున్నాఁడు?"

"ఎచ్చటనైన నుండెనేమో కనుగొందము."

"అక్కడక్కడ తిరిగి చూచి కన్యను మనమే నిర్ణయించుకొనవలయు. మనము బయలుదేరి పోవుదమా?"

"మనమిరువురమునా? మనమిద్దరము నొకేకన్యను వరించునెడల అప్పుడు మన మందులకై కలహింతుమేమో? మన యీస్నేహమునకు భంగము కలుగునేమో?"

"ఆలాగా! అయిన మనము వేఱువేఱుగనేఁ బోవుదము. అయినను మనమిరువు రమును బావమఱఁదులమగుటచే నీభార్య నాసోదరి యగును."

"ఆలాగా! నీకొకసహోదరి యున్నదా? అయినమనకు బంధుత్వము మరలఁ గలియును."

"ఈవిధమునఁ గాకపోయిన మఱియొకవిధముగానైనను మరల మనకు బంధుత్వము కలియఁగలదు. నీకనేకమంది కుమార్తెలు గలుగుదురు. నాకు కుమాళ్లుకలుగుదురు. లేకున్న నాకు కుమార్తెలును నీకు తనయులును గలుగవచ్చును. ధృతరాష్ట్రునివలె నూర్గురు సంతానము గలిగెనేని నూఱు పర్యాయములు మనము సంబంధములఁ గలుపుకొనవచ్చును."

"అయినను ఇప్పుడు నీవు చేయుచున్నట్లే అప్పుడు నన్ను వినోదింపఁ జేయసమర్థురాలు నీసోదరియొక్కతెయేసుమీ. మనము ఏపుబయలుదేరుదమా?"

"ఈవిషయమున మీయమాత్యునితో మాటలాడితివా?"

"లేదు. నేను మాటలాడవలసిన పనిలేదు. ఇది నాస్వవిషయముగాని రాజ్య పరిపాలనముతో సంబంధించినదికాదు. ఇంతేగాక నావివాహము బొమ్మలపెండ్లి వంటి దగుటచే కొలఁదివైభవముతో జరగునది. మాతండ్రిగారు జీవించియున్నను ఈవిషయ మున నాయనతోఁగూడ నాలోచింపను."

"అయిన నీవొక్కఁడవే బయలు దేరెదవా?"

"కేవలము నేనొక్కఁడనే గాను. మంత్రిరెండవకుమారుఁడు నాతోఁ గూడ వచ్చును."

మఱునాటియుదయమున ఇరువురును చెరియొకగుఱ్ఱము నెక్కి పయనమైరి. మంత్రి కుమారుఁడు ఒక్కింతసేపటిలో వారితోఁగూడ నెంబడింప నిశ్చయింపఁ బడెను.

"మోహనా! మీరాజధాని చాలగొప్పపట్టణము. దానిని చూచుభాగ్యమునాకు కొలఁదికాలములోనే యలవడఁగలదు. ఆపట్టణములో నేను పరిణయమాడఁదగిన కన్య యెచ్చటనైన నుండెనేమో చెప్పుము."

"నేను వివాహమాడుటకుఁ దగినకన్య లెవ్వరైన నీపట్టణమందుండిరేమో చెప్పఁగలవా?"

"నీవలె నేను పరిహాసమాడను. ప్రయత్నించి చూచెదను. నాపట్టములో నీవు గ్రహింపఁదగిన కన్య లేరను లేరు. నాపట్టణమున కన్యలి ప్రదేశములలో నున్నారేమో నాకంతగా తెలియదు."

"నాపట్టణములోనైనను నాకావిషయమంతగా తెలియదు. నీవు సార్వభౌముఁడవు. నేను రాజ్యభారము వహింపని రాకొమరుఁడను. నాకంటె నీకే అధికముగఁ దెలిసియుండవలయు."

ఇంతలో మంత్రిరెండవకుమారుఁడు వారలఁ గలిసికొని యిట్లనియెను.

"ప్రభువరా! ఇంద్రప్రస్థపట్టణమున నొకరాజు కలఁడు. ఆతనికి పదకొండేండ్ల వయసుగల యొకకుమార్తెయున్నది. ఆమెకింకను పరిణయముకాలేదు. అదియొకయద్భుత చరిత్రము. ఆమెనివసించియుండు భవనమున ముందటి చావడియందొక పెద్దగంట యున్నది. దానియెత్తు నాలుగడుగులు. దానిమొదటవలయము మూడడుగులు. దానిప్రక్క నొక దృఢమైనబాణమున్నది. ఆబాణమును, గంటయును ఒకేలోహముతోఁ జేయఁబడినవి. కాని అదియేలోహమో యెవ్వరెఱుఁగరు. తండ్రిగారి యానతి ననుసరించి ఆమె యీగంటను చేతులతో త్రోసిగాని, బాణముచే కొట్టిగాని లేక యీరెండుపాయముల చేతనుగాని యెవ్వరు తలక్రిందుగఁ ద్రిప్పఁగలరో వారిని వివాహమాడెదనని ప్రతిన పట్టినది. ఎందరో రాకొమారులు ప్రయత్నించి చూచిరి కాని వ్యర్థమైనది. గంటనుజూచి యదిగుల్లగనుండుటచే బలువుగనుండదని తలంచి దగ్గరకువచ్చి ప్రయత్నించిచూచి తలవెండ్రుకవాసియైనను గదల్పలేక నిరాశులై యాశ్చర్యమునొంది పోవుచువచ్చిరి. ఆవస్తువు లెక్కడనుండివచ్చినవో, ఎవ్వరిచ్చిరో, ఆమెయెవరికిని చెప్పినదికాదు.

ఆకథవినుచున్నంతసేపును ఆతడేదియోపరధ్యానముతోనుండెను. అదినిజమగు కథయైయుండదు. ఏదియో మాయకథవలె కన్పట్టుచున్నది. అంతలోనాతని కేదియో జ్ఞప్తికిరా నిటుతిరిగి చూచియిట్లనియెను.

"నీవు చెప్పినదంతయును నిజమేనా?"

"ప్రభూ! నిజము."

"ఆమెతండ్రియెవరో? చెప్పఁగలవా?"

"నేఁజెప్పలేను. నాకుఁదెలియదు."

"ఆమెపేరు?"

"కమలావతి"

"బహుశః నామిత్రుఁడెరిఁగియుండవచ్చును." అని తిరిగిచూచునప్పటికాతఁడక్కడలేఁడు.

"రాజకుమారుఁడేడీ?"

"కొన్నినిమిషముల క్రిందటనే వెళ్లిపోయినాఁడు."

"ఓహో! అట్లుచెప్పుము. అట్లయిన యీరాజెవరో నీకుతప్పక తెలిసియుండును. నిజమును దాపకుము."

"అయ్యో! క్షమింపుము. ఆరాజకుమారుఁడు మీతోఁజెప్పవలదని నాకాజ్ఞయిడినాఁడు. ఆకన్య యీతని చెలియలు."

చంద్రసేనుఁడు మంత్రికుమారునితోఁగూడ నింద్రప్రస్థమునకు గుఱ్ఱముపైఁ బోవుచు మార్గమధ్యమున నిట్లనుకొనుచుండెను.

"మోహనకుమారుఁడు తనకొక సోదరియున్నదని నాతోఁజెప్పినవాఁడుకాఁడు. ఆమెను నాకొసఁగూర్చుటకై శ్రమయిచ్చెదనని బహుశః యాతఁడు తలంచియుండనోపు. అయిననేనీ కార్యమును విడిచిపెట్టుదునా? ఆదినమున నాయదృష్టవశముననే నాయరణ్యమధ్యమున నాతనిఁగలిసికొనఁగలిగితిని. మేము శీఘ్రకాలములోనే దగ్గరబంధువులమగుదుము. ఇంతేఁగాక అత్యంతవిశ్వాసమును అన్యోన్య ప్రేమయును గల స్నేహితులమై యుండఁగలమనికూడ తోఁచుచున్నది.

చంద్రసేనునకీ ప్రియమిత్రుఁడెట్లుసంభవమయ్యెనో, అట్లే యత్యంతవిశ్వాసమును అన్యోన్యప్రేమయునుగల భార్యకూడ లభింపనున్నది. కొందఱకీప్రపంచమున ప్రేమవిశ్వాసములుగల స్నేహితులు దొరకినట్లే అట్టి నారీమణులుకూడ సులభముగ లభింపుచుందురు. మనచంద్రసేనునకుఁగూడ నట్టి యదృష్టమే లభింపనున్నయది.

# ఆరవ ప్రకరణము.

## పరిణయము.

మోహనకుమారుఁడు నాఁడు తననెట్లు యుక్తిచేతవచించెనో, అట్లే తాను నొకచమత్కారమును చేసి మోసపుచ్చవలెనని తలంచి చంద్రసేనుఁడు మోహనకుమారుని గృహమునకేగక తిన్నగ కమలావతీసౌధసమీపమునకుఁజని గుఱ్ఱమునుదిగి లోనికిఁబోయెను. చావడియందున్న గంటను చేతులతో కదల్పఁబ్రయత్నించెను కాని కదల్పలేకపోయెను. పిదప నటనున్న బాణము వేయఁజూచెను కాని యదియును జేయలేకపోయెను. మరలమరలఁ బ్రయత్నించిచూచియును విఫలమనోరథుఁడయ్యెను. తుదకిట్లనియెను. "చూడగానిది యంతయు మంత్రవిద్యాసంబంధమువలె గన్పట్టుచున్నది. లేకున్న నీగంటను నేనేల స్పృశింపలేకపోవుదును? ఈబాణమును నేనేలపట్టుకొననైనలేకపోవుదును? సామాన్యబాణములతోనైనయెడల నిమిషములో ననుసంధించి యీగంటను త్రిప్పగలిగియుందును." ఇదివఱకువచ్చిన రాజపుత్త్రులెవ్వరు నిట్టిమాటలననియుండలేదు. ఈమాటలను విని రాజకన్యక "కావలసియున్నచో ఇనుముచేఁగాని రాగిచేఁగాని చేయఁబడిన యమ్ములనుగాని యితరవిధములగు బాణములనుగాని పంపించెద" నని వర్తమానమంపెను. ఆతఁడు వేయుచున్న ప్రతిబాణమును వెనుకకు తిరిగివచ్చుచుండెను. గంటయందో, లేక లోహమునందో యేదినొకవిధమగు గూఢమైన శక్తియుండవలయునని తోఁచుచుండెను. చంద్రసేనుఁడు మరలనిట్లనియెను.

"స్వయంవరములయందు రాముఁడు, కృష్ణుఁడు, అర్జునుఁడు మొదలగువారెందఱో రాజకన్యకల గ్రహించియుండిరి. కాని వారెన్నఁడును ఇంద్రజాలములతో సంబంధించిన నిట్టి పరీక్షలయం దాఁడువాండ్రచేఁ బరీక్షింపఁబడలేదు. మాయమంత్రములతోఁ జుట్టుకొని యున్న యీకన్యక నాకక్కఱలేదు. ఈమెనుజయింప నాకిష్టములేదు."

| | |
|---|---|
| కమలావతి మొదటి చెలికత్తె | "మహారాజా! ఈమెను జయింప నిష్టములేదని యనెదవేల? జయింపలేననియనరాదా!" |

రెండవది:—నీవుజయమందఁగలవని మాయుద్దేశము.

మూఁడవది:—వయసునందును వదువునందును నీవు మా రాకుమారికిఁ దగినవాఁడవని మాయభిప్రాయము.

నాల్గవది:—ఈపరీక్షయం దెవ్వరును కృతార్థులు గాఁజాలరు. అందుచేనిఁక నీపరీక్ష విడువఁదగినది.

చంద్ర:—మీ రాకుమారి నీస్వయంవరమున గెలువలేనా? ఈపరీక్షయం దెవ్వరును గెలుపొందఁజాలరనియే మీనమ్మకమా? కానిండు! నన్నుఁ జూచెదరుగాక.

ఇట్లు చెప్పుచు నాతఁడు తనపైనున్న వస్త్రములను దీసివైచెను. తనయౌవనస్వేచ్ఛాచలనమునకై యాతఁడట్లు చేయలేదు. ఆనెపమున నెవ్వరును చూడకుండునట్లు నిలువు టంగీయందు దాచఁబడిన భస్మమునొక్కింత గైకొని తనచేతులఁ రాచుకొనియెను. పిదప వాగంటను చేతులతో నిట్టట్టు తిరుగఁదీసెను. బాణప్రయోగముచే మరల బోరగిలఁజేసెను. మరల తిరుగఁదీసెను. ఇటునటు త్రిప్పి దర్శించెను. ఇట్లనేకపర్యాయము లొనర్చుటఁ జూచి రాజకుమారి చెలికత్తెలు హాసములు చేయుచు చప్పట్లు చరచుచు నాతని నభినందించిరి. చంద్రసేనుఁడు మందహాసము సేయుచు వారలతో. "మీ రాకుమారిని రెండువిధములను మరియన్నివిధములఁగూడ జయించితిని." అని పిదప తననిమిత్త మేర్పరుపఁబడి యాభవనమున కెదురుగనున్న సౌధమున విడిసి యుండెను. ప్రజలాతని విజయోదంతమును విని చాల నాశ్చర్యమునొందిరి. ఆవీరాగ్రేసరుఁడొక చక్రవర్తికుమారుఁడని తెలిసినప్పుడు వారు మతింత యాశ్చర్యపడఁజొచ్చిరి.

మొట్టమొదట రాజకుమారుని జయించి పిదప మోహనకుమారునియొద్దకేగి "నీకొక సోదరి యున్నది. నీవు చెప్పకపోయినను నేను గ్రహించితి" నని చెప్పవలయునని చంద్రసేనుని యుద్దేశము. మోహనకుమారుఁడు చేసినయుక్తికి బదులుగ తానీయుక్తిని చేయవలయునని యాతఁడు తలంచెను కాని మోహనకుమారుఁ డీవార్త నిదివరకే వినియున్నవాఁడు కావున నంతకంటె మేలైనయుక్తి నొకదానిని పన్ని యాతనిని కలవరపెట్టవలయునని యోచించుకొనియెను. మోహనకుమారుఁడు తనసోదరి సమ్మతిని గైకొని యామెవేషము నుధరించి, ఆమె చెలికత్తెలతోఁ గూడ నామెసౌధమందలి వసారాలో నిటునటు దిరుగాడ నారంభించెను. చంద్రసేనుఁడు తనమందిరములోనుండి వారినిఁ జూచి యామె రాజకుమారియని యనుకొనియెను. నిజము తెలుసుకొనుటకై పనికత్తెలనడిగి తెలిసికొని యట్లె నిశ్చయించుకొనియెను. ఆతనిహృదయమున నిరాశ జనియించెను. తనలో

నిట్లనుకొనియెను. "ఈ రాజకన్యక పదకొండేండ్ల బాలికయని విని చాలసంతసించితిని; కాని చూడగా నిప్పుడీమె నాకంటె పెద్దదివలెఁ గన్పట్టుచున్నది, బహుశః ఈమెకు పదునేను పదునారేండ్లుండవచ్చును." ఈవిచారముచే నారాత్రియంతయు నాతనికి నిద్రపట్టలేదు. మరునాఁడు మంత్రితనయునికూడ దీసికొని యింద్రప్రస్థచక్రవర్తి సభకేగెను. చక్రవర్తియును చంద్రసేనుఁడును ననేకవిషయములంగూర్చి చాలసేపు మాటలాడినపిదప వివాహవిషయిక ప్రసంగము వచ్చెను.

"మా జామాత, పరిణయ మెప్పుడు చేసికొననిచ్ఛగించునో" యని చక్రవర్తి ప్రశ్నించెను. చంద్రసేనుఁడేమియుఁ బ్రత్యుత్తరమీయక యూరకుండి మోహనకుమారునితో జనాంతికముగా నేమేమియో చెప్పెను. ఆవిషయములనే మోహనకుమారుఁడు తండ్రితో నీతీరున విన్నవించెను.

"తండ్రీ! మనకమలావతి వయసున కొంచెము పెద్దదియని యాతని యభిప్రాయము.'

"లేదు. లేదు. ఆమె కేవలము బాలిక."

"ఆమెను తాను స్వయముగఁ జూచితినని చెప్పుచున్నాఁడు."

"ఆమె పెద్దదియని యతని హృదయమునకుఁ దోఁచెను కాఁబోలును!"

"ఆమె పదునైదేండ్లదానివలెఁ గన్పట్టుచుండెనఁట!"

"బహుశః యాతఁడామెను చక్కఁగఁ జూచియుండ లేదనుకొనెదను. లేదేని యెవరినేని చూచి యామెయని యనుకొనియుండవచ్చును."

ఇట్లు చెప్పుచు చక్రవర్తి యటనుండి లేచి యావలికేగెను. స్నేహితులిరువురును మాటలాడుచుఁ గూర్చుండిరి.

"ఇంతట నెట్లు త్రిప్పగలితివో నాకుఁ గొంచెము చెప్పవా? అందలి రహస్యమేమి?"

"నీవొక సోదరిని గలిగియుండియు లేదని చెప్పితివి. ఆంగటనుగూర్చి సమస్తము నెఱిగియుండియు నేమియు నెఱుగనివానివలె నటించుచుంటివి."

"నామాటనమ్ముము. దానినిగూర్చి నేనేమియు నెఱుగను."

"నీసహోదరియొద్దనుండి నీవేమియుఁ దెలిసికొనలేదనిన నేను నమ్ముదునా?"

"నిశ్చయము. నేనేమియు దెలిసికొనలేదు. ఆవిషయమై రవ్వంతయు నెవరికిఁ జెప్పనని యామె శపథము చేసికొనినది."

హేమ—(తెరకై పునకుఁ బోవ నుద్యుక్తురాలగుచుండును.)

కేసరి— (హేమలత చేయి పట్టుకొనియాపి తనలో) ఈమె కాతఁడనిన నెంత యనురాగము? (ప్రకాశము) చెలీ! తొందరపడకుము.

హేమ—అదిగో తురుష్కులు చుట్టుముట్టుచున్నారు. అయ్యో! పాపము. అమ్మా! మనము పోయి యాతని రక్షింపఁగలదా;

భవా—ఆ శౌర్యనిధికి భయము లేదు.

(తెరలో) ఓరీ తురుష్కులారా! అక్రమయుద్ధమున నాసోదరుని వధించిన పాపఫల మిప్పు డేయనుభవింతురు గాక! రండు. రండు. నేఁడు మిమ్ము మ్రయశికి బలియొసంగెద.

హేమ—శౌర్యనిధీ! నేను నిదె నీకు సహాయముగ వచ్చుచున్నదానను. (పోఁ బోవుచున్నది.)

కేసరి—సఖీ! ఇప్పుడు మీరిన దేమియును లేదు. ఈపిరికి పందలాతనిదరి నైనఁ జేరఁ జాలరు. భయపడకుము. ఇపుడు నీ వేగిలి వేని యాతఁ డేమనుకొనును? రాజపుత్రులును మాకపకీర్తిని దేవుఁడని యిప్పుడే కదా యాతఁడని వెళ్లినాడు.

(అని హేమలత నాపుచున్నది.)

(తెరలో ధ్వనులు)

భవా—అమ్మాయీ! తొందరపడకుము. ఏమియు భయము లేదు. అవసరము వచ్చిన నే నూరకుందునా?

కేసరి—మేలు పరాక్రమశాలీ! మేలు.

హేమ—(సంతోషముతో) దైవమా! రక్షించితివి?

కేసరి—చెలీ! జయము. జయము. నీమనో...

హేమ—ఛీ! ఛీ!

(తెరలో కలకలము.)

హేమ—అది యేమి? వీరే గాక మరల శత్రువులు వచ్చుచున్నారు కాఁబోలు ను. (తనలో) అయ్యో దైవమా! ఏమి చేయ నెంచితివి? (ప్రకాశము) అమ్మా! సిద్ధము కమ్మా. లెమ్మా.

కేసరి—వారెవరు?

భవా—వారెవరో మన పక్షమువారై యుండవలయు. లేకున్న నీతురుష్కు లేల పరువు లెత్తెదరు?

కేసరి—ఔనౌను. అదిగో మన వీరాగ్రగణ్యుఁడు వారల వెనుదరుమ చున్నాఁడు.

భవా—అదిగో! మన దుర్గదాసును సైనికులును. మహారాజు గారు కూడ వచ్చుచున్నారాయేమి చెపుమా!

(తెరలో) నరాధములారా! రణరంగమునుండి యబలలవలె పారిపోయి యిట వచ్చి యబలలపై శూరత్వము నెరపుచున్నారా! ఛీ! ఛీ! చేవగలిగిన నిటురండు. పోయెదరేల? ఎటకేగినను గౌతముఁడు మిమ్ములను మట్టుపెట్టకమానఁడు.

హేమ—అవి మన దుర్గదాసుమాటలు కావా?

కేసరి—ఔనౌను.

అభ—(ప్రవేశించి) అమ్మా! వందనము. శత్రువులు హతమైరి. హతశేషులు పారిపోయిరి. మిమ్మిటఁ జేర్పవలయునో సెలవిండు. గౌతమహారాజాని వచ్చుచున్నట్లున్నది. వారికడ సెలవుఁ గైకొని పోయెదను.

భవాని—కుమారా! అబలలమగు మమ్ముఁ గాపాడ భగవంతుఁడు మిమ్ముఁ బుత్తెంచినాఁడు.

కేసరి—(తనలో) అందును విశేషించి మాసఖిని...

భవాని—పుణ్యమునకుఁ బోయిన పాపమెదురైనయట్లు పాపము నీసోదరుఁడు మానిమిత్తమై యసువుల విడచినాఁడు. అందులకై మేమెంత యోచించించుచున్నారము. ఎంత చింతించిన నేమి లాభము. కాలధర్మ మెవ్వరికిని దాటశక్యము గాదు గదా!

మ. అకటా! నీదుసహోదరుండు కరుణా ♦ యత్తుండు న న్గావవ
చ్చి కడంకన్ శౌర్యముతోడ శత్రువులతో ♦ చివ్వన్ ప్రదీపించి దై
వకటాక్షంబిసుమంతలేక తనువున్ ♦ బాసెన్ జలంగ నే
రక్షిని కా గాలముదాటరాదనుటనా ♦ రిక్తన్ బోఁకుమో మిత్రమా.

(దుర్గదాసు ఇరువురు సైనికులు ప్రవేశము.)

అభ—(తనలో) మహారాజు కాఁడు. మంత్రి కాఁబోలును.

దుర్గ—అమ్మా! వందనము. సుఖముగా నున్నారా! మీనిమిత్తము మహారాజు గారావైపున కేగినారు.

భవా—అట శత్రువులున్నారని విని యిటు వచ్చితిమి. ఇచ్చటను తప్పినదికాదు.

దుర్గ—శత్రువులున్నారని వినియుండియు నిట్లరుదెంతురా తల్లీ.

అభ—(తనలో) ఈబాలికామణికిఁ బరిణయమైనదా!

భవా—అన్నిఁటికిని దైవమే యున్నాఁడు. సింహాచికప్రముండగు మహారాజుండ మాకేమి కొదువ? అయినను మేము బయలుదేరునప్పటికి మాకీవార్త తెలియదు. ఇదిన వు వచ్చునటులే యీనాఁడును వచ్చితిమి. మార్గమధ్యమున శత్రువులవార్త విని యిట్లు వచ్చితిమి. మహారాజునకీవార్త యెట్లు తెలిసినది?

దుర్గ—సేవకా! ఏయపాయమును లేకుండ నందఱు సుఖముగ నున్నారనియు మేమిట్లు వచ్చుచున్నారమనియు కోటకు దయచేయుచుఁడనియు మహారాజుగారితో విన్నవింపుము.

సేవ—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

కేసరి—(జనాంతికముగా) సఖీ! ఱెప్పవేయక యట్లెచూచుచున్నావేల?

హేమ—పాప మీసుకుమారమూర్తి శరీరమెట్లు గాయములు పడినవో చూడు.

కేసరి—(జనాంతికముగా) ఆతఁడు నీకు ప్రేమైక స్థానముగుటచే యట్లనిపించుచున్నది కాని యంతటి మహారణ మొనర్చినప్పుడా రెండు గాయములు దగులుట కూడ నాశ్చర్యమేనా?

అభ—(తనలో) వీరిరువురును పలుమరు నావైపునకుఁ జూచి యేమేమియో మాట లాడుచున్నారు.

హేమ—ఓసి కృతఘ్నురాలా! ఏమి కాలులు పేర్లు....

కేసరి—నేను కృతఘ్నురాలనే. పోనిమ్ము. నీవు కృతజ్ఞురాలవే.

అభ—(తనలో) వీరిసంభాషణ మేమై యుండునో? నన్నుఁగూర్చి కాదు కదా! ఛీ! హృదయమా! ఉచితానుచితము లెఱుఁగవు సుమా!

హేమ—ఛీ! ఊరకుండుము.

దుర్గ—అమ్మా! ఈతఁడెవ్వరు? విచారసూచకములగు వాక్యముల నుడువుచున్నావేమిటి?

భవా—అమాత్యవరా! ఈతఁడే మమ్ము రక్షించిన యశోనిధి. పాప మీతని సోదరుఁడా కూరులచే రణరంగమున నిహతుఁడైనాఁడు.

దుర్గ—పాపము. అబ్బాయీ! ధైర్యము నొందుము. విధివిధానమనతిలంఘనీయము. అమ్మా! ఈసుగుణరాశి యుదయించుటచే వన్నెకెక్కిన వంశ మేది? ఈతని పేరెవరు?

భవా—మన మిరువురము కూడ నీతని నడిగియే తెలిసికొనవలయును.

హేమ—(తనలో) నామనోరథముకూడ నదియే.

అభ—నేను యోధపుర సంస్థానప్రభుండను శౌర్యనందుని కొమరుఁడను నాపేర భయచందు. స్వర్గవాసియైన నాసహోదరుని నామము నిర్భయచందు. మేమొక రహస్యకార్యముపై పోవుచు నీ నాకీరత్నములకంఠ ధ్వనులను విని యిటకు వచ్చి మా విధిని నెరవేర్చుకొంటిమి. నాసహోదరుఁడు లోకములోని యందఱు సహోదరులవంటి వాఁడు కాఁడు. అట్టి సోదరుఁడు వేయిజన్మములకైన నాకు లభింపఁడు. ఆతఁడీలోకమును వీడిపోయినందులకు నే నావంతయు చింతింపను. రాజపుత్త్రకులమున జన్మించిన వారల కందఱకు నెట్టి మరణముచితమో అట్టి రణమరణమే యాతనికిని లభించినది. అందును అబలామానరక్షణార్థము ఇంతకంటె కావలసినదేమి కలదు?

హేమ—(తనలో) సర్వము ననుకూలము. కాని యిఁకనొకటి యున్నది.

దుర్గ—శౌర్యనిధీ! నిన్నేమనికొని యాడఁగలను?

క. నీవంటిరాజపుత్త్రులు
భూవలయమునందు నుంట ♦ బోపురుషవరే
ణ్యా వరలె రాజపుత్త్రుల
మావంశములెల్ల ననుచు ♦ మది మెత్తు నినున్

భవా—కుమారా! నీవంటివారలవలనఁ గదా క్షీణించుచున్న రాజపుత్త్రకుల ముద్ధరింపఁ బడుచున్నది.

ఆ. ఇట్టిసుగుణవంతు ♦ నిట్టిసుందరివంతు
నిట్టిపురుషమూర్తి ♦ నేపొలంతి
పతినిగాఁగఁ బడయఁ ♦ బఱగంగ నోచెనో
యామెభాగ్య మెంత ♦ యనఁ గవచ్చు

హేమ—(తనలో) ఇట్టి తేజోరాశిఁ జేపట్ట నే కన్నియనోచి యున్నానో?

కేసరి—(తనలో)మా చెలి యదృష్టవంతురాలైన నీతనికిసతియగుట సంభవించును.

అభ—అమ్మా! అనుజ్ఞ. అమాత్యులారా! వెడలి పోవుచున్నాఁడను!

హేమ—(తనలో)ఎక్కడను? ఒక్కపరి మానగరమునకే తెంచరా? అమాత్యుఁడు రమ్మని యనఁడా?

దుర్గ—నాదొక ప్రార్థనము.

భవా—నాయభీష్టము కూడ నదియే.

అభ—ఏమి యాజ్ఞ?

భవా—మానగరమున కొకమారు వచ్చి మాయాతిథ్యమునందుకొని మహారాజు నేయు మన్ననలఁ బడసి మరి పోవలయునని మా యభీష్టము.

హేమ—(తనలో) అంగీకరించునా?

దుర్గ—మహోపకార మొనర్చిన నిన్నుఁగొని పోకుండ మే మేగిన మహారాజు నా గృహమునకు బాలగుదుము. నన్ను మన్నించి దయ చేయవలయు.

అభ—నేను పోవలసిన తావింకను చాల దూరముకలదు. ఈసాయంతనముకటకు జేరకున్న యాకార్యము నెరవేరదు. ఇప్పటికి నన్ను విడువుఁడు. ఆకార్యమును నెరవేర్చి యవశ్యముకొలఁది దినములలో వచ్చి గౌతమభూనాథుని దర్శనముఁ జేసికొనియెదను. మీరు కూడ నే నిట్లంటినని విన్నవింపుడు. కాలవిలంబనమునకు క్షమింపుమనుఁడు.

హేమ—(తనలో) అయ్యో!

శా. అయ్యో నాదురదృష్ట మిట్లగుటకే ♦ మందుర్ణ మరల్ కొల్పి లో
గుయ్యాలింపక నామనోభవము డా ♦ గొంచుర్ణ బ్రియుం జేగునా
నియ్యోజన్ వినవచ్చె నింక నిటనే ♦ నె ట్లార్తి వేగించెదన్
దయ్యంబున్ దయలేనివాఁడగుచు నా ♦ దండన్ బ్రవర్తించెడిన్.

భవా—అవశ్యము రావలయును సుమా!

అభ—తప్పక వచ్చెదను.

దుర్గ—అమ్మా! పట్టణములోని వారందఱు మనకై యెంతయో ఆతురపడుచుందురు. మనము కూడ శీఘ్రముగఁ బోవలయు. ఆచార్యుఁడొకఁడు శత్రువుల ప్రయత్నములజాడ యొక్కించుక తెలుపుటచే మేమిట కరుదేరఁ గలిగితిమి. మేము రాకున్నను మా కంటె నధికముగ నీతఁడే మిమ్ముఁ గాపాడినాఁడు.

అభ—అందులకై వేఱె సన్నిధి నందింపఁ బనిలేదు. మావిధిని నెఱవేర్ప నవకాశ మొసంగి నందులకు భగవాతునకు వందనము లాచరించుచున్నాఁడను.

కేసరి—(తనలో) మీరు వచ్చుటయే యనర్థదాయకమైనది. లేకున్న నీతఁడు మాతోఁ నగరమునకు వచ్చునాఁడే. మాచెలి హృదయపద్మము వికసించెడిదియే.

అభ—అమ్మా! సెలవు.

భవా—జయమగుఁగాక.

(అభయచంద్రొక వంకకును తక్కినవారొక వంకకును నిష్క్రమించుచున్నారు.)

(అభయచంద్రుడును హేమలతయు నొకరినొకరు చూచుకొనుచున్నారు.)

కేసరి—చెలీ! ఇటు. ఇటు. దారియిది.

(అ వ ని క ప డు ను)

# రాజపుత్ర విజయము.

## తృతీయాంకము.

### ప్రథమరంగము—యోధపురరాజమార్గము.

[వామనభట్టు ప్రవేశించుచున్నాఁడు.]

వామన—"ముద్దువచ్చినవారు ముండాయంటారు వేడుకవచ్చినవారు వెధవాయంటారు" అనునటులు ప్రభువులకు మంచికలిగినను కెడ్డకలిగినను సేవకలోకమునకు కష్టసాధ్యమేకదా. కనుకనే "సేవాధర్మః పరమగహనో యోగినామప్యగమ్యః" అని పెద్దలు చెప్పినారు. భ్రాతృవియోగానల తప్తచిత్తుఁడయిన కుమారమహారాజేలకో తన్నానందభవనమునందు స్వయముగఁ గలిసికొనవలసినదని తనయాజ్ఞ నంగరక్షకభటుండగు సుగ్రీవుని మూలమున నాకు దృఢపరచిరి. (తెరనైపునకు చెవియొగ్గి) ఎగిరివచ్చుటకు నేను పక్షిఁగాను. (తిరుగనాలకించి) సరి. సరి. నడువవలయునా? వద్దా? ఇప్పుడే భోక్తృత్వమనుభవించినాను. ఆయాసముగానున్నది. (మఱల వినుటనభినయించి) ఎద్దుపుండు కాకికేమి నొప్పి? (వెండియు నాలించి) ఇందు తక్కువఁ దినినదెవరు అక్కడాయన విరహవ్యథాభారమును గుండెలయందిడుకొని మోయలేక యందే కదలలేకయున్నారు. ఇఁక నిక్కడనే నోయమితాహారభరితంబైన యీపెద్దబొజ్జ బరువును మోచికొనుచు విధి ననుసరించి చిన్నది యొకటియు పెద్దది యొకటియుఁ జొప్పున నడుగులలో నడుగులు వేసికొనుచుఁ బ్రభుసన్నిధికి వచ్చుచున్నాను. "పేనునకు పెత్తనమిచ్చినఁ దలవంతయుఁ గొఱికె" నన్నటులీస్వల్పకాలాధికారమునకై నీవింత మిడిసిపడెదవేల?

తే. గీ. అల్పు లధికారచిహ్నము ♦ న్నంతసేపు
వెనుకముందులు కానక ♦ విఱ్ఱవీఁగి
చివర కప్పదభ్రష్టులై ♦ చెప్పరాని
కష్టపడుదురు జనుల క ♦ నిష్టు లగుట.

(ఆలోచితమనస్కుఁడై స్వగతము) కానిమ్ము. ఇది వీనిచేటుకాలమునకు పుట్టిన బుద్ధియే. గొఱ్ఱె యెంతకొవ్వెనో కసాయివానికంతయును మేలే. మెత్తమెత్తఁగ నూఱుకొన్నకొలఁది నీతొత్తుకొడుకు మీదిమీదికి వచ్చుచున్నాఁడు. ఏలికతో ముచ్చటించి యిఁక వీనిమచ్చరంబును రూపుమాపెదఁగాక. (వెళ్లుచున్నాఁడు)

(ఇదివిష్కంభము.)

---

## ద్వితీయరంగము—ఉద్యానవనము.

[అభయచందు ప్రవేశించుచున్నాఁడు]

అభయ—(సవిచారముగా) అన్నా! దుర్భరదుఃఖానల తప్తచిత్తులకెచటికేగినను జిత్తశాంతి కలుగనేరదు కదా. నేనిప్పుడిట కేలవచ్చితినో నాకే తెలియరాకున్నది. హా! భ్రాతృవత్సలా! యోధపురపరిపాలా! పుట్టిననాఁటనుండియు నొకరి నొకర మెడఁబాయఁజాలక నిద్రాశనవిహారములందు సైతము నన్యోన్యము నొక్కపానుపునందు నొక్కకంచమునందు నొక్కయెడ నొక్కచోటఁ గలసి మెలఁగుచుండిన మనకిక్కాలమునకు నీయకాలమృతిం జేసి యొదవిన దుర్భరవియోగబాధయె దీనికిమూలమనం జెల్లు. (ఆలోచించి) అక్కటా! అది యెట్లులగును. ఎన్నటికిఁ గాఁజాలదు. పుట్టినవారలకెప్పటికేనియుఁ గిట్టక తప్పదు కదా.

మ. సుగుణాసక్తియు నాత్మగౌరము న ♦ స్తోకప్రతాపోన్నతిం
దగ నౌదార్యపరోపకారములు స ♦ త్యప్రీతియుం దేశభ
క్తిఁ గలా రేయుగమందుఁ జచ్చినను స ♦ త్కీర్తిప్రభావ్యాప్తిచే
జగతి న్నేఁటికి నున్నవార లటు లే ♦ సన్మాన్యులై యుండరే.

నీవట్టివారల నొక్కరికేనియుఁ దీసిపోనివాఁడవై పరమపూజ్యమైన వీరస్వర్గము జూఱఁగొంటివి. కనుక నీవు ధన్యుఁడవు. త్రిలోకపూజ్యుఁడవు. యోధపురపోచితంబయిన యావీరస్వర్గసుఖమీవనుభవించుచున్నందులకు భవత్సుఖాభిలాషినైన నేను సంతసింపవలసినదే కాని- అయినను చిరకాలమునుండి పెల్లుమిగిలియున్న మనసహజమైత్రికబాంధవ్య మిత్రత్వానురాగంబులటులు చేయనిచ్చుటలేదు. (ఆలోచించి) కానిమ్ము. (కోపముతో)

చుండును. ద్రౌపది సృష్టివైచిత్ర్యములనెల్ల మునుపటికన్న నెక్కువగా గ్రహించుచు నధికముగా ప్రపంచజ్ఞానమును సుజ్ఞానమును పడయుచు నతిథులకు నభ్యాగతులకు వివిధ సపర్యలు చేసి యాదరించుచు సంతోషముతో కాలము పుచ్చుచుండెను. పాండవుల మీాద ప్రేమగల బంధువులును వాత్సల్యముగల భూసురులును దాక్షిణ్యముగల పౌరులును భక్తిగల సేవకులును ననుదినము వచ్చి చూచి పోవుచుండిరి.

పాండవులయం దనురాగముగల కృష్ణుడొకనాడు తనప్రియకాంతయగు సత్యభామాసహితుడై చనుదెంచెను. పాండవులు వార లెదుర్కొని మర్యాదచేసిరి. ద్రౌపదియు నాదరించెను. సత్యాకృష్ణులు కొన్నిదినములు పాండవులయింట నుండిరి. సత్యభామకు ద్రౌపదీదేవి సగుణములను సౌశీల్యమును చూచినకొలది నాశ్చర్యము కలుగుచుండెను. పాండవులందరును ద్రౌపదిని తమతమ ప్రాణములుగా జూచుకొనుచు గౌరవించుటయు ద్రౌపది తనపతులనందరిని పంచప్రాణములవలె చూచుకొనుచు సమముగా ప్రేమించి సేవించుటయు చూచినకొలంది మిగుల నాశ్చర్యముగా నుండెను.

ఒకనాడు సత్యభామ ద్రౌపదిని చూచి యిట్లుపలికెను. "వదినా? నిన్నొకప్రశ్న మడిగెదను. నాయందు దయయుంచి ప్రత్యుత్తరము సరిగాచెప్పవలయునని కోరుచున్నాను. లోకములోని సతులొక్కపతిని వశముచేసికొని సుఖపడజాలకున్నారు. నీవు నీపతులనందరిని వశముచేసికొని వారియనుగ్రహమునకు పాత్రురాలవై వారిచే బహిఃప్రాణమువలె చూడబడుచున్నదానవు. నీవద్ద మాయలుమంత్రములు నోషధీవిశేషములు నేవియైన గలవో నీపూర్వపుణ్యవిశేషమో యీరహస్యమును తెలుపవేడుచున్నదానను.'' అని యడిగెను.

ఇట్లడిగిన సత్యభామ పలుకులకు నవ్వి ద్రౌపది యిట్లనియె. "సత్త్రీదానా! పతులు వశులగుటకు కాంతల సుగుణములును సత్ప్రవర్తనమును గాక మందులుమాయలు నుండునా! కొందరు సుందరులు తెలివిలేక మగలకు మందులుపెట్టుదురు. అట్టిమందులు పతులకు పత్నులయెడ ప్రేమను పుట్టించుటకు మాఱుగా పతులకు రోగములను పుట్టించును. అట్టిమందులవలన సతులకు మేలు కలుగుటకు మాఱుగా పతులీరహస్యము నెఱింగిరేని మునుపున్న ప్రేమయుకూడ పోయి మరింత యనుమానమును నసహ్యమును విరోధమును గలిగించి కీడేచేయును. కావున నెన్నడును నెవ్వరును పతులు వశులగుదురని తలంచి యేమందులును నుపయోగింపరాదు.''

"నాపతులు నాయందనురక్తులై యుండుటకు గల కారణమును వినుము. నేను నాభర్తలు నన్ను ప్రేమించులాగున వారల ప్రేమింతును. వారల మనసుపట్టి యెల్లప్పుడును వర్తించుచుందును. అహర్నిశములయందును నాథులకేశ్రమయు గలుగకుండ వారలకుపచారములు కడునోరిమితో చేయుచుందును. వారలేకార్యముమీదనైన పోయి యలసివచ్చినయెడల సంసారమునందలి కష్టములను దుఃఖములను నేకరువుపెట్టి వారికి విసుగుపుట్టింపక వారల మనస్సునకు సంతోషముకలుగునట్లు సమయోచితముగా సంభాషణము చేయుచు శ్రమమపనయించు శుశ్రూషలొనరించి తృప్తులను చేయుచుందును. పతులకు హితులైనవారలతో నిష్టముగనుందును. పతులకు విరోధులగువారలతో చెలిమి యుపరిచయమును చేయకయే యుందును. సకలభోగ్యములతో తులతూగునపుడేలాగున గౌరవింతునో నిరుపేదరికము కలిగినపుడును పతులనాలాగుననే గౌరవముతోను ననురాగముతోను సేవించుచుందుదును. గృహకృత్యభారమంతయు నేనేభరించి పతులకేమియు కష్టములేకుండ కడుజాగరూకతతో నాయవ్యయముల నెఱింగి చేయుచు సేవకులందరివలనను పనులుకొనుచు వారల జీతబత్తెముల నుచితకాలములకే యిచ్చుచుందును. పతులకెప్పుడేయుపచారములు చేయవలసివచ్చినను మజ్జనభోజనాదులు సమకూర్చునెడలను పరిచారికాజనముల నియమింపక స్వయముగా నే చేయుచుందును. రాచకార్యములయందుగాని మఱియేకష్టసమయములగాని పతులాలోచనలడిగినయెడల దూరము విచారించి సమయానుకూలముగా తగినచందమున ధైర్యముతో నుపాయముల చెప్పుచు తోడ్పడుచుందును. వేయేల! యెల్లయెడలను నానాథులకు ప్రతిక్షణమును దాసివలెను మిత్రునివలెను మంత్రివలెను సహాయునివలెను వర్తించుచు పతులే దైవములని భావించి పూజించుచుందును. ఇంతకన్న మందులు మాత్రికులు మాయలు మర్మములు నేనెఱుంగను.'' అని చెప్పెను.

సత్యభామ ద్రౌపదిసౌజన్యమునకు నామెజ్ఞానమునకు మిక్కిలి చోద్యము నొంది వదినా! తెలివితక్కువతనమున నేను వేసిన ప్రశ్నకు నాయెడ నలుకయుంచక క్షమించుము. నేడు నీవలన గృహిణీధర్మములనెల్ల నెఱింగి కృతార్థురాలనైతిని'' యని సంతోషించి యనేకవిధముల శ్లాఘించెను. మఱికొన్నిదినములకు సత్యభామాసమేతుడై శ్రీకృష్ణుడు తనపురమున కరిగెను.

తరువాత కొంతకాలము గడచినవెనుక పాండవులైదుగురును వేటకేగిరి. ద్రౌపదియు నొకచెలికత్తెయు మాత్రము పర్ణశాలలో నుండిరి. ఆసమయమున దుర్యోధనుని

జానమరదియగు సైంధవుడు కొంత సైన్యముతో వేటకు వచ్చి యాదారిని పోవుచు ద్రౌపదిరూపమును చూచి మోహించెను. సైంధవుడు కొంచెము దూరమునందుండి తనమిత్రునిచేత తన యభిప్రాయమును పాంచాలికి తెలియచేసెను. పాంచాలి పతివ్రతయగుట తెలిసియు తనకు చెల్లెలగుట నెఱిగియు బుద్ధిహీనుడగు సైంధవుడు తనమనస్సును మరలించుకొనజాలక పాండవులు బలవంతులని తెలిసియున్నను వారికీవార్త తెలిసిన తన్ను వధింతురేమోయని తలపకయు లోకనింద నెంచకయు సైంధవుండిట్టి పాతకమునకు సాహసించెను. కాముకులకు లజ్జయు భయంబును కలుగవు గదా!

సైంధవుని వర్తమానము విని ద్రౌపది హరిహరీ! యని కొంచెము సేపు నివ్వెరపడియుండి పిమ్మట నతనితో నిట్లనియె. ఓ రాజకుమారా! ఈవార్తనంపిన జయద్రథునికి వివరము లేకున్న నీకైన వలదా! నేను పాండవపత్నినైన పాంచాలిననియు పతివ్రతననియు తెలియదా! పతివ్రతలగు కులస్త్రీలతో నిట్టిప్రసంగములు చేయవచ్చునా! మరియు నతండు దుర్యోధనుని చెల్లెలిమగడగుటచే నాకతడన్న కాడా! నాతోడ నిట్టిమాట లతడు పలుకుట హైనము దోసము కాదా! తానొక దేశము నేలెడు న్యాయాన్యాయములును ధర్మాధర్మములును నీతిదుర్నీతులును తెలిసినరాజు కదా? తానే యిట్టియవినీతికార్యము చేయదలంపదగునా? యని గట్టిగా మందలించి మీరందరు మాకుబంధువులు. నాపతులింట లేరు. వచ్చునందాక యిందు నిలిచి మాయాతిథ్యముగ్రహించి పోవలయుననియెను. ఆపలుకులు కొనిపోయి సైంధవునితో నతండు చెప్పెను. అంతమాత్రమున జయద్రథుడూరకుండక ద్రౌపదియున్న యెడకు వచ్చెను.

వచ్చిన సైంధవుని ద్రౌపది వీక్షించి యతండు తన్ను కామించి యేదియో దుష్కార్యము చేయదలచి వచ్చినాడని గ్రహించి పర్ణశాలలోని కరిగెను. సైంధవుడును వెంటనరిగెను. పాంచాలి ధైర్యముగలదియు నేర్పరియు గావున వానిని కుశలప్రశ్నములడిగి మర్యాదచేసెను. పిమ్మట సైంధవుడు కోమలీ! నీసౌందర్యమును చూచి నిన్ను మోహించి వచ్చితిని. నామనోరథము దీర్చి నన్ను మన్నించుము. అని బేలయై వేడుకొనెను. పతులైదుగురును నింటలేనియెడ కాముకుడును బలవంతుడును దుష్టుడును నగు నితండిల్లు సొచ్చుటచే నించుక భయమొందుచున్నను ధైర్యము విడక యెట్లయిన మంచిమాటలచే వానిని సాగనంపవలెను లేదా పాండవులువచ్చుదాక వాదోపవాదములు సముచితగతిని చేయుచు వానిని నిలుపవలయునని తలంచి యతనికిట్లనియె.

అన్నా! నీవు నేను చెలియాలను పతివ్రతను పుత్రవతిని ధర్మవతిని. ఇట్టి నన్ను నీవిట్టి నీచపుమాటలనదగదు. నాపతులీవృత్తాంతము వింటిరేని నీకపాయము సంభవించును. నాహితమును విని యీపాపకృత్యమునుండి నీచిత్తము మరల్చుకొమ్ము. అని బోధించెను. సైంధవుడు నీతియుక్తములగు నానాతివాక్యములు సరకుసేయక బలవంతమున మొండితనమున ద్రౌపదిని పట్టి రథమున బెట్టుకొని పోవుచుండెను. ద్రౌపది యొక్కతె యగుటచేతను నిరాయుధురాలగుటవల్లను నేమియు చేయజాలక యెలుంగెత్తి యేడ్చుచుండెను. అంతలో పాండవులింటికివచ్చి పాంచాలి తమరాకకెదురుచూచుచు ముంగిట లేమికేమిహేతువో యని తలపోయుచు చేరవచ్చి కన్నీరు కాలువలుగా ప్రవహింప నేడ్చుచు శెంగగొనియున్న ద్రౌపది దాసిని చూచిరి.

దాసియు నేడ్చుచు నెదురుగావచ్చి జరిగినసంగతియంతయు చెప్పెను. అంతట భీముడు మొదలగు పాండవులాగ్రహచిత్తులై యతిరయంబున నరిగి సైంధవునితో యుద్ధముచేసి యాతనిసైన్యములను సంహరించి యాతనిని చావగొట్టి తలగొరిగించి పరాభవించి పర్ణశాలకు కొనివచ్చిరి. ధర్మరాజును ద్రౌపదియు నతనియెడల కనికరించుటయెటులున్నను దుస్సలనుతలంచి కనికరించి యతనిని చంపవలదని చెప్పి యతనికి బుద్ధిచెప్పి విడిపించిరి. ఇట్లు వనవాసము పండ్రెండేండ్లును గడచెను.

అజ్ఞాతవాసమెచ్చట నేవిధమున చేయుదుమాయని పంచపాండవులును చక్కగా నాలోచించి మత్స్యదేశమునేలు విరాటమహారాజుపురము నివాసయోగ్యమైనది యనియు నతండు మంచివాడనియు యోచించి ధర్మరాజు కంకుభట్టను పేర యతీశ్వరునివేషమును భీముడు వలలాంకుడను పేర వంటలవానివేషమును నర్జునుండు బృహన్నలయను పేర నర్తకునివేషమును నకులుడు దామగ్రంధియను పేర నశ్వశిక్షకుడుగను సహదేవుడు తంతీపాలుడను పేర పశుపాలకుడుగను నేగి విరటుని సేవించుచు నొకసంవత్సరముదనుక నుండ నిశ్చయించిరి. ద్రౌపది సైరంధ్రీవేషమున మాలినియను పేర బరగుచు విరాటుని యంతఃపురమునందుండి రాణియగు సుధేష్ణను సేవింపనిశ్చయించుకొనెను. ఈవిధమున నారుగురును విరటునిపురము ప్రవేశించి కొలువు చేయుచు కాలముగడుపుచుండిరి.

ఈప్రకారము జరుగుచుండ విరటుని బావమరదియు సుధేష్ణతమ్ముడునునగు సింహబలుండను నతండు తనయక్కగారి మందిరమున కొక్కనాడువచ్చెను. ద్రౌపది యచ్చట పూలు గుచ్చుచు నొకయెడగూరుచుండెను. నిరుపమానమైన సౌందర్యమును యా

వనమును సౌకుమార్యమును గలిగి యలంకారములు లేకున్నను జగన్మోహినీ దేవతయో యన మెరయుచు మునులకైన మోహముపుట్టింపగలరూపవతియగు నామెను చూచినతోడనే సింహబలుండత్యాశ్చర్యమునొందుచు మోహాంధుడయ్యెను. అతండు హృదయమునుపట్ట జాలక సత్వరము సైరంధ్రిని సమీపించి తనవృత్తాంతము నెరింగించి తన్నుఁ గవయుమని కోరెను.

పరమపతివ్రతాతిలకమగు ద్రౌపది తనకెక్కుడికి పోయినను నిట్టియాపదలే సిద్ధ మగుచుండెనుగదాయని యించుకచింతించి యతండు తనయేలికసానికి సోదరుండగుటఁగ్ర హించి మంచినీతులచే నాతనిబుద్ధి మరలింపజూచెనుగాని యా మెయెంతసామవాక్యము లాడిన నతండంత ధూర్తత్వము కన్పరచసాగెను. అంత ద్రౌపది యించుకకోపించి య తనిని గట్టిగామందలించెను. అంతకును వాడు తన్ను విడువకున్న నికనట నిలువరాదని సుధేష్ణయొద్దకుపోయి నిలిచెను.

అంతట సింహబలుడు తనసోదరినిచేరి యాసైరంధ్రివృత్తాంతము నడిగి తెలిసికొని తనకోరిక నామెకు రహస్యంబుగా నెఱింగించెను. ఆమె యోగ్యురాలగుటచే నదికూడ దనియు హానియునపకీర్తియు వాటిల్లుననియు నామెకు గంధర్వులైన పతులేవురున్నవా రని విన్నదాననినియు వారతిబలవంతులనియు వారివలన ముప్పువాటిల్లక మానదనియు చెప్పి భయపెట్టెనుకాని యెంతకునుదుర్మార్గుడగు కీచకుడు వినక యాసైరంధ్రినిక తనవశ ముచేయకున్న ప్రాణములు విడిచెదనని గట్టిపట్టుపట్టెను. ఎట్టకేలకు సోదరుని ధూర్త త్వమున నతనియెడల గలయనురాగము పెంపున సుధేష్ణ తమ్మునికోరిక దీర్చెదనని వాగ్దాన ముచేసి పంపించెను.

అనంతరమున సుధేష్ణ సైరంధ్రిని పిలిచి కీచకునింటికిపోయి మధువును కొనితెమ్మని మిషపెట్టి పంపించెను. ద్రౌపది నీచుడైన కీచకునియింటికేగిన తనకేమికీడుమూడునో యనియు వెళ్లకయున్న సుధేష్ణకేమికోపమువచ్చునోయనియు నాలోచించి తుదకు వెళ్ల క తప్పదనియు సుధేష్ణ నియోగించుటచే సింహబలునింటికి పులియున్నపొదలోనికి మేక పిల్లవలె ద్రౌపది యరిగెను. సైరంధ్రికి తనయందనురాగము గలిగించి తనయక్క పం పించినదని సంతసించుచు నడపరకె యెదురుచూచుచున్న సింహబలుడామెను చూచినతో డనే యానందపరవశుడై యామెచెంతకరిగి యామెను పట్టుకొనబోయెను.

ద్రౌపది దూరముగా దొలగియుండి కీచకా! మీయక్క కొంచెము మధువు కొని తెమ్మని నన్నంపినది యిదుగో పాత్రము నాకవ్వల పనియున్నది వేగిరము పంపుము అని యడిగెను. సింహబలుండు కాంతా! తొందరపడెదవేల మధువింకొకరిచే పంపిచెదనులే. మహారాజుభార్యవై యుండదగిన నీచేత దాసీజనముచే చేయింపవలసినప చేయించిన మాయక్కయెంతయు వివేకహీనురాలు. నేను మహారాజును బలవంతుడను నన్ను పెండ్లియాడి నాతోడ సకలసౌఖ్యములు ననుభవించుచుండుము. పరమదరిద్రులై నీపతులను విడువుము. అని యేమేమో కొన్నిదుర్భాషలాడుచు మోహోద్రేకము నోపలెరుంగక మీదికి వచ్చి యామెను పట్టుకొనబోయెను. ద్రౌపది వానిబారిని తప్పిచుకొని వాని యిల్లు వెడలి పారిపోయెను.

కీచకుడతినీచుడు. నీతిరహితుడు. బలగర్వితుడు. అందువలన లజ్జాభయంబులు లేక వీధులవెంట పరుగులెత్తును ద్రౌపదిని వెంటాడించెను. అంతట సైరంధ్రి తత్తరమున బోవుచు తన్ను రక్షించువారెవ్వరును లేనందున సమీపముననేయున్న విరాటుని సభకు పరుగెత్తి పోయెను. ఆదుర్మార్గుడంతటితో విడువక వెంబడించి పోయి చిలుక పిల్లను బట్టుకొనుగండుపిల్లినలె నోడిసిపట్టుకొని కూలద్రోచెనుగాని తానుకూడ గూలంబడెను. అంతట వెంటనేలేచి కీచకుడు సిగ్గువడి యొదుపుదప్పిన మహాసర్పమువలె కోపముతో ద్రౌపదిని చూచుచు నిలువబడెను. ఈకథనంతయు గనుంగొనుచు వంటలవాని వేషముననున్న భీముడు సింహబలుని సంహరించెదగాకయని సన్నాహము చేసెనుగాని కంకుభట్టురూపమున నచ్చటనేయున్న ధర్మరాజు తామసమువలదని వారింపగా శాంతించి యూరకుండెను.

అంతట ద్రౌపది విరాటునకిట్లనియె. ఓమహారాజా! నీబావమరందియగు కీచకుడు నాకు చేసిన పరాభవమును కన్నులార జూచియు నిట్టూరకుండుట న్యాయమా! ప్రజలను శిక్షించి న్యాయమును రక్షింపజాలిన మహారాజునెదుటనే మానవతులకిట్టి యవమానము జరుగుచుండ నిక నితరులెవరైన నబలలమానము రక్షింపగలరా! ఇట్లయిన మానినీమణులు బ్రదుకగలరా! అనియడిగిన సింహబలుడు తనకన్న బలవంతుడగుటచే తన్ను లక్ష్యపెట్టనివాడని యెఱింగియున్నందున సైరంధ్రికేమియు ప్రత్యుత్తరమీయక సింహబలుని మంచిమాటలతో మందలించెను. కీచకుడు విరాటుని పలుకులయెడ గౌరవముంచి తిన్నగా వినకయే యచ్చటినుండి లేచిపోయెను.

ధర్మరాజు ద్రౌపదికిగలిగిన యవమానమునకు సహింపజాలకయు నేమియూ చేయలేక యామెను చూచియిట్లనియెను. కాంతామణీ! నీవచనములు మహారాజును సభ్యులును విన్నవారు. నీకింక నాతనివలనభయముండదు. నీవింక నీతావునకు పొమ్ము. అని పలికిన ద్రౌపది మరల నేమియో చెప్పబోగా ధర్మరాజు మరల నామెతో ననియెను. ఓసతీమణీ! కులకాంతవగు నీవు లజ్జవిడిచి యిట్లు సభలోనికి వచ్చి వాదోపవాదములు చేయదగునా? నీవేమియు నిక పలుకక యింటికిపొమ్ము. నీవర్తనము చూడగా నర్తకివలె నున్నావు అని మందలించెను.

మునీంద్రా! అవునునీవన్నయట్లు నేను నటినే. నాభర్త నాట్యమాడువాడు నేనతనిమార్గమనుసరించుట ధర్మమేయగునుగదా! మరియు నాభర్త జూదరిగానే నగును. జూదరివానియాలికి లజ్జాభిమానము లెక్కడనుండును? అనియెత్తిపొడుపుమాటలాడి యచ్చోటినుండివెడలెను.

సుధేష్ణద్రౌపదినిచూచి యేమియు నెరుగనిదానివలె సైరంధ్రియేలయింత చిన్నబోయియుంటివి? నిన్నెవరైననేమైన ననిరా యేమి తెల్పుము శిక్షించెదను. అనిపలికెను. సైరంధ్రి యామెమాటలకిట్లనియె. అమ్మా! నీవు తెలిసియు తెలియని యట్లునటించిన నేనేమని తెల్పగలను అయినను నడిగితివిగాన చెప్పెదనువినుము. అని సవిస్తరముగా నంతయువినిపించెను. సుధేష్ణతమ్ముని దూషించి ద్రౌపదినోదార్చి క్షమింపుమని వేడుకొనెను.

నాటిరాత్రి నిశీథమున రహస్యముగా భీముడున్న వంటశాలకుపోయి నిద్రించుచున్న యతనినిలేపి దుఃఖించుచు ద్రౌపదియిట్లు మొఱపెట్టుకొనెను. నాధా! పాంచాలదేశాధీశ్వరుండైన ద్రుపదమహారాజు పుత్రులకన్న నధికముగా గౌరవించుచు పెంపగా పెరిగితిని. పాండుమహారాజుపుత్రులగు పంచపాండవులకుపత్నినై కుంతీమహాదేవి కోడండ్రలోపల నగ్రగణ్యముగా కొనియాడబడితిని. ప్రాణములకెల్ల ప్రాణముగాచూచుకొనుచు మీరునెయ్యము నెరపగా నడచుకొంటిని. జనులందరును తలిదండ్రులవలె భక్తినేయుచు పూజింపగా చెలంగితిని. రూపగుణపరాక్రమంబులచేత రూఢికెక్కు కొడుకులనుగని భరతవంశమునందు నాయిల్లేయిల్లుగా నతిశయిల్లి బాంధవావళిచేత పొగడబడితిని. మీరు మిగులమన్నించుటచేత క్షత్రియపుత్రికలలో నెల్లవాసిగాంచితిని. దాసీసహస్రములచే ననుక్షణమును పనులుగొంటిని. మాయత్తగారుసయితము నాకెప్పుడయిన నొకచిన్నపని

చెప్పుటకయిన సంశయించుచుండును. అట్టిమహావైభవము ననుభవించిన సుకుమారికి నాకిప్పుడు సుదేష్ణకు సేవసేయవలసినగతిపట్టినది. నాధా! ఆసుదేష్ణకెంతచేసినను సంతుష్టిలేదు. నున్నదనముగానలుగులుపెట్టియు చందనమలందియు వింతవింతలగు కలపంబులుగూర్చియు పూలమాలికలుగుచ్చియు జడలుముడిచియు నామెకన్నుసన్నల మెలంగుచు పనులుచేయుచుండుటచే నెన్నడు నలవాటులేని నాచేతులెట్లుపొక్కి కాయలు కాచియున్నవో చూచితివా! అనిచేతులు చూపుచు కన్నీరుకాలువలుగట్టి భీమసేనుని హృదయముకరిగి నీరుగార నేడ్చుచుండెను.

కుసుమకోమలియును నాగర్భశ్రీమంతురాలును నగు పాంచాలిపడుచున్న పాట్లు చూచియు నామెయేడ్పువినియు భీమునిగుండెలు కరిగిపోయెను. భీమసేనుడు యాజ్ఞసేనికష్టములకెల్ల కారణముకౌరవులేయని తలచి యప్పుడేపోయి వారలనెల్ల నుగ్గునూచముగా చేయదలంచెను గాని కార్యభంగమును తలంచియు నన్నగారియానతినితలంచియు వెంటనే కోపముచల్లార్చుకొనెను. శాంతచిత్తుడై ద్రౌపదికన్నీరుదుడిచి బుజ్జగించి యోదార్చి యామెహృదయమును చల్లపరచువాక్యములిట్లు పలికెను.

మానినీమణీ! నీకష్టములు తొలగిపోయి సౌఖ్యపదుదినములు సమీపమునకువచ్చుచున్నవి. చింతింపకుము. ఓపికపెట్టుము. ఆపదలెప్పుడును కాపురములుచేయవు. మనవలె పూర్వమెందరెందరు శ్రీమంతులు ధీమంతులు కష్టములొందలేదు? దుఃఖములనుభవింపలేదు? చ్యవనమహామునిమనోరధము దీర్చుటకై శర్యాతిమహారాజపుత్రిక యడవులలో నిడుములుకుడవలేదా! శ్రీరామునితోనరణ్యవాసము నొనరించి సీతామహాదేవిశ్రమలుపొందలేదే? అగస్త్యమహాముని నిమిత్తమైలోపాముద్రయలజడిపాలుగాలేదె? నలమహారాజు నెడబాయక వనములకరిగి దమయంతీదేవి కడగండ్లబడయలేదె? హరిశ్చంద్రుని విడువక చంద్రమతి కష్టములనుభవింపలేదే? వారలందరును నోపికదాల్చి దుర్భర దుఃఖసాగరంబులదాటి సౌఖ్యసాగరముల నోలలాడరే? నీవును నావిధంబుననె సైరణ వహించి యాపదలసహించి సత్కీర్తినిసంపాదించుకొనియెదవు. మనమజ్ఞాతవాసమారంభించి పదునొకండు నెలలైనవి. ఇకనొకమాసముమాత్రమే గడుపవలసియున్నది. నీకు దుర్భరమైన పరాభవమును కావించిన యాదురాత్ముడగు సింహబలుని రేపేసంహరించి నీకు చిత్తశాంతినికలిగించెదను. నీవుపోయి యానీచుని మనయర్జునుండున్న నాట్యశాలలో

# న్యాయవాదివిలాసము.

## చతుర్థగుచ్ఛము.

రంగము—క్లబ్బుమందిరము.

[నీలకంఠముగారును, సీతారామశర్మయును ముచ్చటించుచుండగా రంగయ్య ప్రవేశించుచున్నాఁడు.]

నీల—గుడ్ మార్నింగ్ మిష్టర్! రంగయ్యా.

రం—గుడ్ మార్నింగ్.

నీల—మీరు క్లబ్బులోకి వస్తూవుంటారా?

రం—ఆ! ఏమి తమరు అలా సెలవిస్తారు? క్లబ్బులలోకి వచ్చుటకు మేము తగినవారము కామా?

నీల—అందుకుకాదు? మీరు ఓల్డు స్కూలులోనివారు. ఇంగ్లీషు పరిజ్ఞానము తక్కువ. ఇక్కడ సాధారణముగా "బిల్లియర్డ్సును" "టెన్నీసు" "చెస్సు" యీలాటిఆటలు, ఇంగ్లీషుపేపర్లు చదువుకొనే కుర్రవాళ్ళేగాని పెద్దవాళ్ళు వస్తూవుండరు గనుక అలా అన్నాను కాని మీరు తగినవారు కారని కాదు.

రం—నాకు మీధోరణిచూస్తే అలాగునే అర్థమైనది లెండి. నాకు ఇంగ్లీషులో కొంచెము ఢోక్కశుద్ధి అయింది లెండి. మీకుమల్లే లీడింగుఆర్టికెల్సు చదవలేకపోయినను ఏవో న్యూస్ అంతు నోట్సు లేక మెడ్వరుటైజుమెంట్సు లో చూస్తూవుంటాను లెండి.

నీల—నో! నో! సార్! మిమ్ములను ఇన్‌సల్టు చేయడము తలంపునాకు లేదు; క్షమించండి దయచేయండి.

సీతా—నీలకంఠంగారు! మీరు చాలా పొరపాటుబడినారు. ఇప్పుడు రంగయ్యపంతులుగారు క్లబ్బులోనికి రావడమంటె ఉన్నంత సరదామరిదేనియందును లేదు. ఈసంవత్సరము దానికి గృహదానము చేసినారు. గ్రంథభాండాగారము కూడా యేర్పాటుచేయడపు తలంపుతోనున్నారు.

నీల—ఇప్పుడంటూవున్నారు. ఇదివరకుమాత్రము లేదా?

సీతా—ఆ! లేకేమిగాని ఇదివరకంతా సోమయాజులుగారివేషము.

నీల—అది యేమిటి?

సీతా—గడ్డం మీసం గొరిగించుకోవడము ఒంటినిండా విభూతి పూసుకోవడం, రుద్రాక్షలు ధరించడం, భాష్యాలు చదవడం, రామోపాసనలు, బాలోపాసనలు చేయడము, వేదపారాయణలు, హరికథలు చెప్పించడము కార్తీకసోమవారాలు, మాఘస్నానాలు, చేసేవి సూర్యనమస్కారాలు ఇట్లాంటి చపలాలు కొన్నాళ్ళు ఉండేది.

నీల—అంతలోనే ఇంతమార్పు ఏలావచ్చింది?

సీతా—అదియొక గాలిపాటు.

రంగ—ఆలాటి గాలిపాటు మనవాళ్ళ కందరికీ ఉన్నదె. పూర్వాచారపరాయణత్వము కొన్నాళ్ళు, నవనాగరికశిరోమణిత్వము కొన్నాళ్ళు దివ్యజ్ఞానస్వామాజికత్వము కొన్నాళ్ళు, భాష్యశాంతి కొన్నాళ్ళు, పాపశాంతి కొన్నాళ్ళు చేయడము నాకేకాదా సంపూర్తి అయినది.

సీతా—పంతులుగారు కోపపడకండి. గాలిపాటు అని ఎందుకన్నాను. అట్టిచాంచల్యముండుటచేతనే. గాలి ఒకమోస్తరుగా వీచునా? క్షణక్షణమునకు మారుచుండును. అటులనే మనకందఱకును మార్పు కలుగును.

రం—అంతచాంచల్యము మీకందరికీయుండునేమోగాని నాకు ఉండదు. నేను ఏపనిచేసినను రాజానుమతియే ధర్మమని యాచరించుచుందును. ఈక్లబ్బులు, మీటింగులు, ఆటలు, పాటలు ఉంటె తరుచు రాజుగారచ్చటికి వత్తురు. తరుచు వచ్చుటచేత స్నేహము కలుగును. ఆశ్రయించడమువలన అభిమానము గలుగును. అందుచే ననేకలాభములు గలుగును. ప్రభువులు, స్త్రీలు, లతలు, యేవిదగ్గరుండునో దానినే యవలంబింతురను నీతి వినలేదా?

సీతా—అది పరమధర్మమే! పరధర్మమైనను రాజధర్మమే స్వధర్మపరిత్యాగము చేసి అయినా సరే తప్పక ఆచరించుచుండవలెను.

నీల—మీరు మాట్లాడేమాటలు నాకు గ్రీక్ అండు లాటిన్‌లాగునున్నవి అర్థంకావడంలేదు.

రం—"పిల్లకాకేమి యెరుగునురా? ఉండేలుదెబ్బ" అని ఆసీతారామశర్మమాటల అర్థము పదేళ్లనుంచి ఓడి వడపోస్తూవున్నవాణ్ని నాకు తెలియవలెను గాని నీకేమి తెలియును?

నీల—ఆయనమాటలు నానార్థములు వచ్చేటట్లు మాట్లాడునా?

రంగ—ఏమిమాటలు? కాసుగళ్లైనా లాభములేని మాటలెందుకు? ఈలాంటితుక్కోజీమాటలు నాకు చేతకాదు. మనము ఏమైనా కాగాంతుగు పట్టవలెను. అధికారిముఖమైనా ఖరి, గుణవిశేషములనుబట్టి మన గుణవిశేషములను నడపుచుండవలెను. గాని యథార్థము పనికిరాదు.

సీతా—నేను చెప్పబోయ్యేది మీరే చెప్పినారు. రంగయ్యగారికివలె యెత్తుకు తగినమారెత్తువేసే ప్రజ్ఞ మనసంఘములో ఎవరికివిలేదు. ఏమనగా మన రంగయ్యగారు ఏదియైనను కేజులో పనిచేయునప్పుడు నానారసములు కురిపిస్తూవుంటారు లెండి.

నీల—అదియెట్లు?

సీతా—"ఛీఫ్" యక్జామినేషన్‌లో శృంగారము, "క్రాసు" లో వీరరసము "రీ" లో కరుణారసము మధ్యమధ్య శోకరసము, హాస్యరసము చివరకుగెలిస్తే సారసము ఓడితే నీరసము ప్రకటనచేస్తూఉంటారు. ప్లీడరీ యను కపటనాటకమున కీయన సూత్రధారుడని చెప్పవచ్చును.

రంగ—అవును! ఏలాగుచేయకపోతె ఈడూళ్ళో జరిగిన వ్యవహారములలో దాటి యీవల ఏలాబడినాననుకొన్నారు? ఎన్నివేషాలు వేయకపోతే చివరకీ పెద్దవేషము వచ్చినది?

సీతా—నిజము నిలుచునుగాని మాయ నిలుచునా? నిలవదు.

రంగ—కలియుగములో కృతయుగధర్మములు కొయకూడదు. చేసినచో రాజద్రోహమగును. ఇందుకు ప్రమాణము.

"కలౌకార్తయుగాన్ ధర్మాన్ । యోనరఃకర్తుమిచ్ఛతే
రాజద్రోహీంవిమత్వా। నతం వర్ధయతేకలిః."

అనగా కలియుగమందు కృతయుగధర్మాచరణము చేయువానిని రాజద్రోహిగా నెంచి కలి వృద్ధి కానీయడని యర్థము.

సీతా—కాని చివరకు సత్యమే జయము నిచ్చును. "యతో ధర్మస్తతోజయః" అని వినలేదా?

నీల—సీతారామశర్మగారు చెప్పినది నిజమే యని నాకు తోచుచున్నది?

రంగ—ఓఅబ్బాయీ? నీవు ఏలాగునో కష్టపడి బియల్‌ప్యాసు అయినావు కాని నీకు ప్రపంచానుభవము లేదు. అది లేకున్న ఎంతచదువుజదివినను ఉపయోగముండదు. కాబట్టి ప్లీడరైనవాడు ఏమేమిచేయవలయునో చెప్పెదను వినుము.

నీల—పంతులుగారు మీరు వయస్సుచేతను, ప్లీడరీలోను, అనుభవజ్ఞానములోను నాకన్న పెద్దలు. కాబట్టి మీరు ఏలాఉపదేశము చేస్తే ఏలా నడచుకోమంటె ఆలాచేస్తాను.

రంగ—నేను ప్లీడరీధర్మసూక్ష్మముల సంగ్రహముగ వచించెదను వినుము.

సీ. అధికారిలంచంబు లందువాడాయెనా
ప్లీడరు పేరముల్ బెట్టవలయు
నధికారి వ్యభిచారి యైనచో ప్లీడరు
తరుణులరావించి తార్చవలయు
నధికారి కర్షియైనచో ప్లీడరు
కర్తలజేయంగ గడగవలయు
నధికారిసంస్కర్తయగునేని ప్లీడరు
సంస్కారములనెల్ల సలుపవలయు

గీ. వేషభాషలచేష్టల వివిధగతుల
ప్రభుల ననుకరించుట జయప్రదముగాన
ప్రభువులేమేమి పోకళ్లబరగునవియ
ధర్మమనుచును ప్లీడర్లు దాల్చవలయు.

నీల—అట్లయినచో ప్లీడరుకాగానే అంతరాత్మను చంపివేసి పరాధీనుడుకావలెననియా మీయభిప్రాయము. ఇక నీవృత్తియందు స్వాతంత్ర్యమేమున్నది.

సీతా—రంగయ్యపంతులుగారు అనుభవజ్ఞానమువలన చెప్పుచున్నారు గనుక వారియుపదేశము మనము శిరసావహించవలసినదే.

రం—ఇదినాయొక్కని యనుభవమే కాదు. ప్లీడరీచేసేవారికందరికి తెలిసినయంశమే!

సీతా—తెలిసిననేమి? అనుష్ఠానము చేయుటకు సమర్థులు కావద్దా?

రంగ—సాగినచో అంతాసమర్థులే?

నీల—అధికారికాగ్రహమువచ్చినను సరే కాని ప్లీడర్లు నీతిబాహ్యములైన పనులు యకూడదు.

సీతా—అందుచేతనేకాదా ఇప్పటిప్లీడర్లయందు గౌరవము తగ్గిపోవుచున్నది. మేము 'బియె' 'బియల్'ము, మేము "ఫస్టుగ్రేడ్" ప్లీడర్లము, మేము "బారిస్టర్"ము "అట్టర్నీలము" "అడ్వొకేట్ జనరల్లున్ము" "పబ్లికుప్రాసెక్యూటర్లము" "గవర్నమెంటు ప్లీడర్ల" మంచు పెద్ద పేర్లుపెట్టుకొని బల్లలు కట్టుకొని, కోట్లువేసుకొని నూటికి పావలాచొప్పున ఫీజులు పుచ్చుకొనువారు కొందరు, ఇచ్చిపుచ్చుకోవడం తరువాత చూచుకోవచ్చును. వకాల్తునామా యివ్వమని పార్టీలను ప్రాధేయపడువారు కొందరు, కొద్దిఫీజుల బుచ్చుకొని గొప్పఫీజుల బుచ్చుకొన్నామని ప్రగల్భాలు కొట్టువారు కొందరు. ఎట్టినడతగలవాడయినను సరే ధనవంతుడైన పార్టీని కౌగలించుకొని కుర్చీలమీద కూర్చుండపెట్టి వారి పాదరక్షలమోయుచుండువారు కొందరు. యీరీతిగా ననేకరకముల వారిప్పుడు బయలుదేరుచుండుటయే గౌరవలోపమునకు కారణము.

రంగ—"పరుగెత్తలేక తనమీద బలాదూరన్నట్లు వ్యవహార తంత్రములు చేయుటచేత గాక అందుకు సమర్థులగువారిని జూచి యోర్వలేక యేడ్చువారు ఎన్నాళ్ళు ప్లీడరీలో యేడ్చినను వారిపని "సీతారామాభ్యాన్నమః" కంటె యెక్కువప్రయోజనకారి కాదు.

సీతా—మానధనులట్లు లెంచరు. నీతిబాహ్యమైనపనుల చేయకనే సంపాదించి గౌరవములొందు ప్లీడర్లు లేరా? వారిని యధికార్లు సన్మానించుటలేదా! వారికి గొప్పయుద్యోగముల నిచ్చుటలేదా! ఆత్మశ్లాఘనము చేసికొనినతరువాత ఐశ్వర్యమెందుకు!

రంగ—వ్యవహారధర్మమునకును నీతిశాస్త్రమునకును సంబంధమేలేదు. ధర్మశాస్త్రమెరిగినవా రాచారముల నడుపగలరా? వారి కనుగొనుటకును సంశయమే. చివరకు 'సంశయాత్మావినశ్యతి' అని వారిపని

ఉభయభ్రష్టుత్వమే? అధికార్ల అనుగ్రహము రాదు; పార్టీల ఆదరణము రాదు.

నీల—దేశకాలపాత్రములను బట్టి ధర్మములను మార్చుచుండవలయుననియా మీయభిప్రాయము. సరే ఇంక నేమైనవిశేషము లున్నవా?

రంగ—ఇంకాకావలసినన్ని యున్నవి? ప్లీడరీలో బాగా "షైను" కావలయునన్నవాడు లెంగ్తి క్రాస్ యెగ్జామినేషన్ చేయడం అభ్యసించవలెను.

సీతా—అది కేజునుబట్టి సాక్షి తెలివితేటలనుబట్టియు మార్చుచుండవలెను. 'పిడుగునకు బియ్యమునకు', ఒకటే మంత్రమన్నట్లు ప్రతి సాక్షిని విశేషముగా క్రాసుచేయుటచే మనకత్తితో మనగొంతుకు మనమే కోసుకోవడము తటస్థించును.

నీల—అది యేలాతెలియును.

సీతా—గ్రంథావలోకనమువలనను, పెద్దలగువారు చేయు సాక్షివిమర్శనమును చూచుచుండుటచేతను, స్వయముగా కేజులలో పని చేయుచుండుటచేతను కొంతకాలమునకు అనుభవము కలుగును. దాని మీదట అన్నినేర్పులు కలుగును.

రంగ—నేను మాత్రము ఏమిచెప్పినాను. ప్లీడరీతంత్రము లనుభవైకవేద్యములనియే కాదా?

నీల—రంగయ్యగారు! ఇంకా ధర్మసూక్ష్మములేమైనను గలవా?

రంగ—అబ్బో! వేలకొలది గలవు. అయినను కొన్నిచమత్కారములు చెప్పి విరమించెదను. నేను కోర్టులో జరిపేచర్యలు ప్రతిదినమును కనిపెట్టి యట్లు నీవుకూడ చేయుట యలవాటు చేసికొనుచుండినచో కొద్దిదినములలో మాకోర్టులో నీవే "లీడింగ్ వకీలు"గా నెన్నబడుదువు.

నీల—అవి యేవియో సెలవిండు. అట్లనే నేర్చుకొనదగినవి నేర్చెదను.

రంగ—సావధానుడవై యాకర్ణింపుము—

సీ. ఛీఫులో, సాక్షికి, చెప్పిచెప్పనియట్లు
తన కేసు రుజువంతదనరవలయు
క్రాసులోసాక్షిని గడుహీనుగా జేసి
యెదిరి వాదమునేల జదరవలయు
తనలోట్లు 'రీ' యందు దగగూడదీయుచు
నధికారిదయజాల నందవలయు
కేసులోగెల్చిన కేకలవేయుచు
బహుమానములవేగ బడయవలయు

గీ. నోడి, పోయిన, జడ్జికి, యూహలేద
టంచు జెప్పి యప్పీలుకు నంపవలయు
జడ్జి దూషింప 'భూషించె' "జయమువునది"
యనుచు పార్టీల నమ్మించి యనుపవలయు.

నీల—మీరు చెప్పినది యుక్తియుక్తముగ నున్నది.

సీత—కాని అనుష్టానయోగ్యము కాదు. 'చీఫు'లోను 'రీ'లోను లీడింగ్‌ప్రశ్నల వేయనీయరు. క్రాసులోసాక్షిని మిస్‌లీడ్ చేయకూడదు. అవమానించరాదు. ఈలాటిచర్యలవలన అధికార్లకు అనుగ్రహము కలుగదు. ఆగ్రహమే వచ్చును.

రంగ—ఆ హికమతులు తెలియక పోయినచో అట్టులే యగును.

నీల—రంగయ్యగారు మీధర్మోపన్యాసము ముగిసినదా?

రంగ—ఇంకా చెప్పవలసిన సంగతులు చాలా ఉన్నవి?

| ఇంగ్లీషు తేదీ | తిథులు | వారం | 1912 సం॥ డిశంబరు నెల పరీధావి సం॥ కార్తికం, మార్గశిరం. |
|---|---|---|---|
| 1 | 7, 8 | ఆ | స 4-49, అష్టమి 54-17, మఖ 19-45, రావి 10-41. |
| 2 | 9 | సో | న 53-34, పుబ్బ 15-43, రావి 4-54. |
| 3 | 10 | మం | ద 48-36, ఉర 12-4, రావి 4-6. |
| 4 | 11 | బు | ఏ 44 20, హ 8-57, రావి 0-28, పశ్చాదస్తం గురు 48-44 ఉషా 2 శు 26-28 |
| 5 | 12 | గు | ద్వా 40-54, చి 6-34, శో 48-2, కా 12-37, దివి 20-16 |
| 6 | 13 | శు | త్రి 38-30, స్వా 5-8, దివి 19-1 |
| 7 | 14 | శ | చతు 37-20, విశా 4-50, దివి 14-57. |
| 8 | 30 | ఆ | ● అమా 37-15, అనూ 5-34, దివి 20-2 |
| 9 | 1 | సో | శు॥ ప్రి 38-33, జ్యే 7-38, విషాభావః |
| 10 | 2 | మం | ద్వి 41-7, మూ 10-55, దివి 6-41, ప్రాగుదయంబు 27-57 |
| 11 | 3 | బు | తృ 44-52, పూషా 15-28, రావి 13-44 |
| 12 | 4 | గు | చ 49-24, ఉషా 20-53, రావి 9-40 |
| 13 | 5 | శు | పం 54-31, శ్రి 27-2, రావి 10-30 |
| 14 | 6 | శ | ష 60-0, ధని 33-32, రావి 25-52 |
| 15 | 7 | ఆ | స 60-11, శత 39-55, రావి 29-56, మూ 1, రవిః 1-27 |
| 16 | 7 | సో | స 5-17, పూభా 45-52, శేషః 1-57 |
| 17 | 8 | మం | అ 9-48, ఉభా 50-59, దివి 11-59 |
| 18 | 9 | బు | న 13-21, రే 54-58, దివి 22-58 |
| 19 | 10 | గు | ద 15-36, అశ్వ 57-57, రావి 19-57 |
| 20 | 11 | శు | ఏ 16 53, భర 59-40, దివి 22-38 (ముక్కోటి) |
| 21 | 12 | శ | ద్వా 16-44, కృ 60-4, దివి 2-52 |
| 22 | 13 | ఆ | త్రి 15-22, రో 59-20, రావి 12-1 |
| 23 | 14 | సో | చతు 14 36, మృ 57-40, దివి 17-44 |
| 24 | 15 | మం | ○ పౌ 9-24, ఆర్ద్రి 55-6, దివి 17-46 |
| 25 | 1 | బు | కృ॥ ప్రి 6-10, పున 51-51, దివి 23-28 |
| 26 | 2, 3 | గు | ద్వి 0-1, తృ 54 36, పుష్య 47-6 దివి 10-16 |
| 27 | 4 | శు | చ 48-20, ఆశ్లే 43-59, దివి 17-27 |
| 28 | 5 | శ | పం 42-39, మఖ 39-51, దివి 1 55, రావి 30-53 |
| 29 | 6 | ఆ | ష 36-58, పుబ్బ 35-32, శేషః 2-8, ధ 3 శు 13-20 |
| 30 | 7 | సో | స 31-31, ఉత్త 32-7, రావి 24-27 |
| 31 | 8 | మం | అ 26-35, హ 28-52, రావి 20-27, మూ 1, ధనుష్కుజః 54-54 |

# గ్యారంటి బంగారు లక్ష్మీపిల్లకాసులు

ఈకాసులయెత్తు, బంగారువన్నె, సైజు, పనితరము, మామూలుఫ్రెంచి పిల్లకాసులకు మించియుండును. ఈయెత్తు, ఈవన్నెబంగారముగల ఫ్రెంచికాసులు రు 4-4-0 లకు అమ్ముచుండగా మాలక్ష్మీకాసులు రు 3-4-0 లకే కానుబంగారముచేసి అమ్ముచున్నాము. మీరు బంగారం తెచ్చియిచ్చేయెడల చార్జిపుచ్చుకొని స్వదేశీలక్ష్మీకాసులను యంత్రములసహాయమువలన చేసియిచ్చెదము. నాలుగుపెద్దకాసులు కరగించి 20 లక్ష్మీకాసులు తయారుచేయుటకు 1కి 0-4-0 చొప్పున రు 5-0-0 లు. 20 లక్ష్మీకాసులు పైగా ఎన్నితయారుచేసినప్పటికి 1కి 0-3-0 చొప్పున తయారుచేయుదుము. మావద్దనున్న లక్ష్మీకాసులుసైజున మీరుబిళ్ళలుచేయించి తెచ్చేయెడల 20 లక్ష్మీకాసులలోపువాటికి 1కి 0-3-0 చొ॥నను, 20 లక్ష్మీకాసులుదాటినవాటికి 1కి 0-2-0 చొ॥నను మజూరితీసుకొని బిళ్ళలు కాసులుచేసి యిచ్చెదము. బిళ్ళలుచేయుటకు సైజుకావలసినచో మావద్ద చిక్కును. వలయువారు—

అయ్యగారి బాపిరాజుగారు, ప్రొప్రయిటరు.

శ్రీవిద్యానిలయ ముద్రాక్షరశాల. ఇన్నీసుపేట, రాజమండ్రి.

---

## విద్యానిలయముద్రాశాల.

రాజమహేంద్రవరము.

---

ఇందన్నివిధములైన యచ్చుపనులును తప్పులు లేకుండగను నీటుగను, చౌకగను చేయబడుచుండును. గ్రంథకర్తలు ప్రూఫ్ చూచుకొననక్కఱలేదు.

మునసబుకోర్టులలోను తాలూకాకచేరీలలోను గూడ నుపయోగింపబడు నన్నిరకముల ఫారములు నీటిదరఖాస్తుఫారములు గూడ సరసమగు వెలకు మావద్ద దొరకును. వలయువారు,

మేనేజరు, విద్యానిలయముద్రాక్షరశాల,

రాజమహేంద్రవరము. (అని వ్రాయవలయును.)